విశాఖపట్టణం
సోమవారం 6 జులై 2026

For a pure tomorrow..

# జయ జయహే

epaper.jayajayahey.com   సంపుటి: 9   సంచిక:163   వెల: రూ.5/-   పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool



## దక్షిణకొరియాకు లోకేశ్

ఆరు రోజుల పాటు పర్యటన.. పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యం

2

# అన్ని స్థానాలు గెలవాల్సిందే..!

త్వరలోనే స్థానిక సంస్థలు

పనితీరు ఆధారంగానే పదవులు

నియామకాల్లో మొహమాటల లేవు

నిఖార్సైన కార్యకర్తలను గౌరవించాల్సిందే

కుప్పం పార్టీ శ్రేణులతో సీఎం చంద్రబాబు






(చిత్తూరు - జయజయహే)

త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్నాయి.. అన్ని స్థానాల్లోనూ గెలవాల్సిందే అని పార్టీ శ్రేణులకు టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో కూటమే గెలువబోతోందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. వరుసగా మూడో రోజు సీఎం చంద్రబాబు కుప్పం నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. అందులో భాగంగా ఆదివారం కుప్పం నియోజకవర్గ పార్టీ శ్రేణులతో ఆయన సమావేశమయ్యారు. తెలుగుదేశం కార్యకర్తలు, నేతలకు సమాజంలో మంచి పేరు, గుర్తింపు ఉంటుందని అన్నారు. చెడ్డ పేరు తెచ్చుకునేలా ఏ ఒక్క నేత, కార్యకర్త వ్యవహరించకూడదని సూచించారు. పనితీరు ఆధారంగానే పదవులు కేటాయిస్తామని స్పష్టం చేశారు. పదవుల నియామకాల్లో ఎలాంటి మొహమాటాలు ఉండవని కుండబద్దలు కొట్టారు. పార్టీ కోసం పనిచేసిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ విస్మరించబోమని అన్నారు. ద్వితీయ శ్రేణి నాయకులు కూడా నిఖార్సైన కార్యకర్తలను గౌరవించాలని సూచించారు. బూత్ స్థాయి మొదలుకుని ఏ పదవికైనా కార్యకర్తల ఆమోదం ఉండాల్సిందేనని తెగేసి చెప్పారు. 2029 ఎన్నికల్లో మళ్లీ అధికారంలోకి వచ్చి తీరుతామని సీఎం చంద్రబాబు విశ్వాసం వ్యక్తం చేశారు. గతం కంటే మెజార్టీ పెరిగేలా కృషి చేయాలని పార్టీ శ్రేణులకు ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. కార్యకర్తల ఆర్థిక సాధికారత కోసం పార్టీ పరంగా కృషి చేస్తున్నామని ..మిగతా 2లో



## ఉప ప్రధానిగా అమిత్ షా..?

కేబినెట్ పునర్వ్యవస్థీకరణకు సిద్ధం

పార్లమెంట్ సమావేశాలకు ముందే చేసే యోచన

బీజేపీ అధిష్టానం బిగ్ ప్లాన్

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం త్వరలో కేంద్ర కేబినెట్ పునర్వ్యవస్థీకరణ చేపట్టే అవకాశాలపై రాజకీయ వర్గాల్లో ఊహాగానాలు జోరందుకున్నాయి. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు ముందే కేంద్ర కేబినెట్ పునర్వ్యవస్థీకరణ ఉంటుందని తెలుస్తోంది. ఈ మేరకు రంగం సిద్ధమైందని, ప్రస్తుతం కేబినెట్ నుంచి కొందరిని తప్పించి.. యువ నేతలకు అవకాశం కల్పించే దిశగా బీజేపీ అధిష్టానం ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. అంతేకాక.. ఎన్డీయే భాగస్వామ్య పక్షాలకూ ఈ కేబినెట్ పునర్ వ్యవస్థీకరణలో పెద్దపీట వేస్తారని తెలుస్తోంది. ఇదంతా ఒకవైపు అయితే.. మరోవైపు.. భవిష్యత్‌లో ఎన్డీయేను మరింతగా బలోపేతం చేసేందుకు బీజేపీ అధిష్టానం బిగ్ ప్లాన్ సిద్ధం చేసినట్లు సమాచారం. అందులో భాగంగానే కేబినెట్ పునర్వ్యవస్థీకరణలో ప్రస్తుత కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాకు మరో కీలక పదవిని కట్టబెట్టేందుకు రంగం సిద్ధమైనట్లు రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది. వచ్చే వారం పదిరోజుల్లో కేంద్ర కేబినెట్ పునర్ వ్యవస్థీకరణ జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తుండగా.. అమిత్ షాకు ఉప ప్రధానిగా ..మిగతా 2లో

# ప్రశ్న రావణ్‌పై ఉపా చట్టం

దేశద్రోహం కేసు నమోదు

కఠిన సెక్షన్లతో ఉచ్చు బిగింపు

ఇప్పటికే నాలుగు కేసుల్లో అరెస్ట్

ప్రభుత్వ వైఖరిపై తీవ్ర విమర్శలు

(అమరావతి - జయజయహే)

రాష్ట్రంలో తీవ్ర సంచలనం సృష్టిస్తున్న యూట్యూబర్ బచ్చలకూరి జోసెఫ్ అలియాస్ ప్రశ్న రావణ్ వ్యవహారం మరిన్ని మలుపులు తిరుగుతోంది. ఇప్పటికే వరుసగా నాలుగు వేర్వేరు కేసుల్లో అరెస్ట్ అయ్యి, ఆ నాలుగు కేసుల్లోనూ బెయిల్ పొంది విడుదలైన ప్రశ్న రావణ్‌కు చిక్కులు తప్పడం లేదు. తాజాగా ఆయనపై అత్యంత కఠినమైన రాజద్రోహం కేసును నమోదు చేశారు. దేశంలోనే అత్యంత కఠినమైన చట్టంగా పరిగణించే అన్‌లాఫుల్ యాక్టివిటీస్ ప్రివెన్షన్ యాక్ట్ కింద ఈ కేసు నమోదైంది. గన్నవరంలో జనసేన నేత గరికపాటి శివశంకర్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా స్థానిక పోలీసులు ఈ చర్యలు చేపట్టారు. ప్రశ్న రావణ్ తన సోషల్ మీడియా వేదికల ద్వారా చేస్తున్న వ్యాఖ్యల ద్వారా దేశ ..మిగతా 3లో





## 116 ఏళ్ల బామ్మకు వీఐపీ బ్రేక్ దర్శనం

వృద్ధ భక్తురాలు నవీనతమ్మకు టీటీడీ గౌరవం

నేడు శ్రీవారి దివ్య దర్శనానికి ఏర్పాట్లు

2



పూరీ తీరంలో చిక్కుకున్న 10 మంది

## మత్స్యకారులు సురక్షితం

ఒడిశా మెరైన్ పోలీసులు రక్షించిన మత్స్యకారులు

(విశాఖపట్నం - జయజయహే)

అమరావతి, రాయగడ పట్టణం, విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: ఒడిశాలోని పూరీ సముద్ర తీరంలో చిక్కుకున్న పది మంది ఆంధ్రా మత్స్యకారులను అక్కడి మెరైన్ పోలీసులు సురక్షితంగా రక్షించారు. విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలం చింతపల్లి గ్రామానికి చెందిన వీరందరూ నాలుగు రోజుల క్రితం కాకినాడ హార్బర్ నుంచి మెకనైజ్డ్ ఫిషింగ్ బోటులో చేపల వేటకు బయలుదేరారు. వారు ప్రయాణిస్తున్న బోటు ఇంజిన్ పాడైపోయింది. అప్పటికి పూరీ సముద్ర తీరానికి సుమారు 3 కి.మీ దూరంలో చిక్కుకుపోయారు. వెంటనే అక్కడి అధికారులకు సమాచారం చేరవేశారు. పూరీ ఎస్పీ మార్గదర్శకాల ప్రకారం బలియాపొండ, పెంటకోట మెరైన్ పోలీసులు మత్స్యకారుల దగ్గరికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. యజమాని దానయ్యతో పాటు పది మందిని కాపాడి ఒడ్డుకు తీసుకొచ్చారు. మత్స్యకారులు క్షేమంగా ఉండటంపై మంత్రులు అచ్చెన్నాయుడు, కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు హర్షం వ్యక్తం చేశారు.

# ఫ్యాక్షనిజం.. రౌడీయిజం..!

## జగన్ నమ్ముకున్నది వీటినే

ప్రభుత్వంపై దుష్ప్రచారానికి వైసీపీ ఫండింగ్

డిసెంబర్ నాటికి క్వాంటం కంప్యూటింగ్ సిద్ధం

త్వరలో గాలేరు - నగరి ప్రాజెక్టు పూర్తి చేస్తాం

కుప్పానికి బారీ ప్రాజెక్టులు

అన్ని నియోజవర్గాలు ఇదే స్థాయిలో అభివృద్ధి

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

(చిత్తూరు - జయజయహే)

గొడ్డలి పార్టీ నేతలు ఫండింగ్ చేసి మరీ తమ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేయిస్తున్నారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తనపై, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పైనా విమర్శలు చేసేందుకు కొన్ని సామాజిక మాధ్యమాలకు జగన్ అండ్ కో ఫండింగ్ ఇస్తోందని ధ్వజమెత్తారు. హింస, అసభ్యతలనే గొడ్డలి పార్టీ నమ్ముకుందని ఎద్దేవా చేశారు. ఫ్యాక్షన్, రౌడీయిజాన్ని జగన్ ప్రోత్సహిస్తున్నారని ఆగ్రహించారు. హంద్రీ – నీవా కాలువ ద్వారా కుప్పం వరకూ నీరు తీసుకువచ్చామని తెలిపారు. త్వరలో గాలేరు నగరిని కూడా పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఆదివారం కుప్పం నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో సీఎం చంద్రబాబు పాల్గొని మాట్లాడారు. ఏపీ వ్యాప్తంగా విస్తృతంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జరుగుతున్నాయని సీఎం ..మిగతా 2లో





## చికెన్ @ రూ. 340

తగ్గిపోయిన ఉత్పత్తి

సరఫరాలో లోపం.. సామాన్యుల బెంబేలు

(హైదరాబాద్ - జయజయహే)

తెలుగు రాష్ట్రాల్లో చికెన్, కోడిగుడ్ల ధరలు కొండెక్కాయి.. ధరలు ఒక్కసారిగా పెరగడంతో వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత కొద్ది వారాలుగా ధరలు వరుసగా పెరుగుతుండటంతో సాధారణ కుటుంబాల నెలవారీ ఖర్చులపై అదనపు భారం పడుతోంది. కోళ్ల ఉత్పత్తి తగ్గడం, ..మిగతా 3లో

For a pure tomorrow.. జయహో

# అన్ని స్థానాలు గెలవాల్సిందే..!

మొదటి పేజీ తరువాయి...



వివరించారు. ఇంటికో పారిశ్రామికవేత్త విధానాన్ని అమలు చేస్తున్నామని గుర్తు చేశారు. దీన్ని ప్రజలతో పాటు.. పార్టీ కార్యకర్తలు కూడా అందిపుచ్చుకోవాల్సి ఉందన్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని సక్రమంగా జరిగేలా చూడాలని పేర్కొన్నారు. అందరి ఆమోదంతో కుప్పంలో సమన్వయ కమిటీ వేస్తామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. పై స్థాయిలోనే కాదు... క్షేత్ర స్థాయిలో కూడా పొలిటికల్ గవర్నెన్స్ ఉండాలన్నారు. సమస్యల పరిష్కారం విషయంలో పోలీసులు, అధికారులతో పార్టీ యంత్రాంగం సమన్వయం చేసుకోవాలని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలోని వాస్తవాలను ప్రభుత్వ, పోలీసు అధికారులకు వివరించి సమస్యలను పరిష్కరించేలా చూడాలని అన్నారు. పేదల పక్షాన నిలిచే టీడీపీ నేతలు, కార్యకర్తలకు అధికారులు, పోలీసులు కూడా సహకరించాలని సూచించారు. మంచికి అండగా నిలిచే టీడీపీ నేతలు, కార్యకర్తలను ప్రభుత్వ యంత్రాంగం గౌరవించాల్సిందేనని స్పష్టం చేశారు. ప్రజలతో అనుసంధానమై ప్రభుత్వ పథకాల అమలును కార్యకర్తలు, నేతలు పరిశీలించాలని సూచించారు. పథకాల అమలులో ఏమైనా ఇబ్బందులు, జాప్యం జరిగితే వాటిని సరిచేసే బాధ్యతను కార్యకర్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా ఛారిటీ చేద్దాం... పార్టీ ద్వారా రాజకీయమే చేద్దాం అని స్పష్టం చేశారు. గొడ్డలి పార్టీ కుట్రల పట్ల అప్రమత్తంగా ఉండాలని టీడీపీ శ్రేణులకు సూచించారు. కుప్పం నియోజకవర్గంలో ఎవరైనా రౌడీయిజం చేయాలనుకుంటే కుదరదని అన్నారు. 2019-24 మధ్య కాలం రాష్ట్రానికి ఓ పీడ కల అని అభివర్ణించారు. కుప్పం నియోజకవర్గంలో కూడా ప్రశాంతత చెడగొట్టాలని నాటి పాలకులు ప్రయత్నించారని వైసీపీ నేతలపై సీఎం చంద్రబాబు మండిపడ్డారు. ఈ సమావేశానికి చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, చిత్తూరు జిల్లా అధ్యక్షుడు షణ్ముఖ రెడ్డి, కుప్పం నియోజకవర్గ ముఖ్య నేతలు, కార్యకర్తలు హాజరయ్యారు. కుప్పం పర్యటనలో భాగంగా రైతులు, పీ4 లబ్దిదారులు, పార్టీ నేతలు, కార్యకర్తలు, అధికారులతో సీఎం చంద్రబాబు వరుసగా సమావేశం అయ్యారు.

# దక్షిణకొరియాకు లోకేశ్

### ఆరు రోజుల పాటు పర్యటన

### పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యం

(అమరావతి - జయజయహే)

నేటి నుంచి 6 రోజుల పాటు మంత్రి లోకేశ్ రిపబ్లిక్ ఆఫ్ కొరియా (దక్షిణ కొరియా)లో పర్యటించనున్నారు. దక్షిణ కొరియా మధ్య ద్వైపాక్షిక సంబంధాల బలోపేతం చేసేందుకు తమ దేశంలో పర్యటించాలని రిపబ్లిక్ ఆఫ్ కొరియా ఆయన్ని ఆహ్వానించింది. వారి ఆహ్వానం మేరకు ఈరోజు నుంచి ఈ నెల 11 వరకు ఆరు రోజుల పాటు పర్యటించనున్నారు. ఈ సందర్భంగా కొరియాలో వివిధ మంత్రిత్వశాఖల ప్రతినిధులతో అధికారిక సమావేశాల్లో లోకేశ్ పాల్గొంటారు. ద్వైపాక్షిక సహకారాన్ని పెంపొందించే లక్ష్యంతో ఈ అధికారిక సమావేశాలను నిర్వహిస్తున్నామని దక్షిణ కొరియా కాన్సులేట్ జనరల్ చాంగ్ న్యూన్ కిమ్ మంత్రి లోకేశ్‌కు రాసిన లేఖలో పేర్కొన్నారు. ఇరుదేశాల మధ్య మరింత సహకారం, సంబంధాల బలోపేతానికి ఈ పర్యటన కీలక అడుగు కాగలదని భావిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలోనే నేడు దక్షిణ కొరియా రాజధాని సియోల్‌లో ఇండియా డయాస్పోరా ఆత్మీయ సమావేశానికి లోకేశ్ హాజరకానున్నారు. అక్కడి భారతీయులు, తెలుగువారిని ఉద్దేశించి లోకేశ్ ప్రసంగిస్తారు. ఈ నెల 6న దక్షిణ కొరియా టెక్ స్టార్టప్ సంస్థల ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశంతో పాటు వివిధ సంస్థలతో పెట్టుబడి చర్చల్లో పాల్గొంటారు. అనంతరం హ్యోసంగ్ భారీ పరిశ్రమ సంఘం అధ్యక్షుడు టకేషి యొకోటా, సియోల్ సెమికండక్టర్స్ వైస్ ప్రెసిడెంట్ టేహ్యూంగ్ లీతో సమావేశమవుతారు. ఈనెల 7న ఎల్జీ కెమ్ గ్లోబల్ గ్లోబల్ స్ట్రాటజీ సెంటర్ ప్రెసిడెంట్, ఎల్జీ ఓవర్ సీస్ కంపెనీస్ హెడ్ ఏర్పాటు చేసిన విందు సమావేశంలో లోకేశ్ పాల్గొంటారు. ఎల్జీ అనుబంధ సంస్థలకు చెందిన ఉన్నత స్థాయి ప్రతినిధి బృందాలు ఈ సమావేశానికి హాజరుకానున్నాయి. 8న కొరియన్ మెరైన్ అక్విప్ మెంట్ అసోసియేషన్ ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశానికి లోకేశ్ హాజరవుతారు. ఈనెల 9న కొరియన్ పొలిటికల్ ఎఫైర్స్ డిప్యూటీ మినిస్టర్ మిస్. యుయి-హే సిసిలియా చుంగ్‌తో భేటీ అవుతారు. అనంతరం కొరియన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఒ ఇన్వెస్టిమెంట్స్ డిప్యూటీ మినిస్టర్ కాంచన్ కాంగ్‌తో సమావేశమవుతారు. ఈనెల 10న వివిధ సంస్థల ప్రతినిధులతో పెట్టుబడి చర్చలతో పాటు కొరియా ఆటో ఇండస్ట్రీ కోఆపరేషన్ ఏజన్సీ ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశానికి లోకేశ్ హాజరవుతారు. అదేరోజు రాత్రి సీఐఐ పార్టనర్ షిప్ సమ్మిట్--2026 విజయవంతం చేయాలని కోరుతూ కొరియా కంపెనీల ప్రతినిధులతో రోడ్ షోలో పాల్గొంటారు.

# ఫ్యాక్షనిజం.. రౌడీయిజం..!

మొదటి పేజీ తరువాయి...

చంద్రబాబు వ్యాఖ్యానించారు. కుప్పం నియోజకవర్గానికి గతంలో ఎన్నడూ రానన్ని పారిశ్రామిక ప్రాజెక్టులు వస్తున్నాయని తెలిపారు. ఈ నియోజకవర్గానికి రోడ్లు, కమ్యూనికేషన్ సహా అన్ని రంగాల్లోనూ కనెక్టివిటీ పెంచుతున్నామని చెప్పుకొచ్చారు. అభివృద్ధి చెందిన కుప్పంను ప్రజలు చూడబోతున్నారని వివరించారు. రాష్ట్రంలోని ప్రతీ నియోజకవర్గాన్ని ఇలాగే తీర్చిదిద్దుతామని అన్నారు. అభివృద్ధి వికేంద్రీకరణ విధానంలో అన్ని ప్రాంతాలూ ప్రగతి సాధించేందుకు వీలుగా ప్రణాళికలు చేశామని వెల్లడించారు. ఏపీలో క్వాంటం, సెమీ కండక్టర్ల విభాగాల్లో పెట్టుబడులు తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పుకొచ్చారు. డిసెంబర్ నాటికి అమరావతిలో క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ కార్యకలాపాలు ప్రారంభమవుతాయని వివరించారు. ఇంధన రంగంలోనూ సౌర, పవన విద్యుత్ ఉత్పత్తితో పాటు ఇతర అత్యుత్తమ విద్యుత్ సరఫరా విధానాలను అందుబాటులోకి తీసుకువస్తామని సీఎం చంద్రబాబు తెలిపారు. ఏపీలో ప్రముఖ స్టీల్ పరిశ్రమలు ఆర్సెలార్ మిట్టల్, జేఎస్‌డబ్ల్యూ కంపెనీలు తమ ప్రాజెక్టులను ఏర్పాటు చేస్తున్నాయని అన్నారు. రాష్ట్రంలో పరిశ్రమలతో పాటు పచ్చదనానికి కూడా ప్రాధాన్యం ఇస్తున్నామని వెల్లడించారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలకు పరిష్కరిస్తున్నామని చెప్పుకొచ్చారు. సంక్షేమం, అభివృద్ధితో కూటమి ప్రభుత్వం ముందుకెళ్తుంటే కొందరు అడుగడుగునా అడ్డు పడుతున్నారని ధ్వజమెత్తారు. గత పాలకులు కంపెనీలకు భూములు ఇచ్చి వివాదాల్లోకి నెట్టారని ఆగ్రహించారు.

### ఖనిజ సంపద బ్లాక్ అయ్యాయి

జగన్ హయాంలో విలువైన భూములు, ఖనిజ సంపద బ్లాక్ అయ్యాయని సీఎం చంద్రబాబు ఆందోళన వ్యక్తం చేశారు. ఓబుళాపురంతో పాటు ఆన్ రాక్ కూడా ఈ తరహాలోనే ఇబ్బందుల్లో పడిందని చెప్పారు. ఆయా కంపెనీలను తరిమేసి, పరిశ్రమలను పారిపోయేలా చేయటమే వైసీపీ నాయకులు పనిగా పెట్టుకున్నారని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రతీ ప్రాజెక్టునూ తామే తీసుకువచ్చామని చెప్పుకుంటున్నారని విమర్శించారు. వాస్తవం లేకపోయినా అదే పనిగా అసత్యాలు చెబితే ఎవరేం చేయగలరని అన్నారు. వైసీపీ హయాంలో ఏజెన్సీ ప్రాంతాన్ని గంజాయి సాగుకు కేంద్రంగా మార్చారని దుయ్యబట్టారు. ఇప్పుడు కేంద్రప్రభుత్వం కూడా డ్రగ్స్ ఫ్రీ ఇండియా క్యాంపెయిన్ ప్రారంభించిందని తెలిపారు. తిరుమల శ్రీవారి ప్రసాదాన్ని కల్తీ చేసి భక్తుల మనోభావాలను దెబ్బతీసిన వ్యక్తులు ఇప్పుడు నీతులు చెప్పడం విడ్డూరంగా ఉందని సీఎం చంద్రబాబు ఎద్దేవా చేశారు.



# రెస్క్యూ ఆపరేషన్..!

### సముద్రంలో ఆరుగురు మత్స్యకారులు గల్లంతు

### ఓ వ్యక్తిని కాపాడిన మరో బోటు సిబ్బంది

### గల్లంతైన వారి కోసం గాలింపు

### రంగంలోని నేవీ, కోస్టు గార్డు

### హెలికాప్టర్‌తో గాలింపునకు సీఎం ఆదేశాలు

### ఎప్పటికప్పుడు నివేదికివ్వాలని పిలుపు

### కలెక్టర్‌తో మాట్లాడి పవన్ ఆరా

(విశాఖపట్నం - జయజయహే)



నైరుతి రుతుపవనాల రాకతో సముద్రంలో ఏర్పడిన అల్లకల్లోల వాతావరణం, బలమైన ఈదురుగాలుల కారణంగా విశాఖపట్నం తీరంలో ఘోర ప్రమాదం జరిగింది. చేపల వేట కోసం సముద్రంలోకి వెళ్లిన ఏడుగురు మత్స్యకారులతో కూడిన బోటు బోల్తా పడిపోయింది. ఈ ప్రమాదంలో ఆరుగురు మత్స్యకారులు సముద్రంలో గల్లంతు కాగా.... మరో వ్యక్తిని కాపాడారు. విశాఖపట్నం ఫిషింగ్ బోట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ లక్ష్మణ్ రావు తెలిపిన వివరాల ప్రకారం... జూలై 1వ తేదీన ఈ ఏడుగురు మత్స్యకారులు వేట కోసం సముద్రంలోకి వెళ్లారు. షెడ్యూల్ ప్రకారం వారు జూలై 4వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకల్లా తిరిగి తీరానికి చేరుకోవాల్సి ఉంది. ఈ మేరకు వారు తమ కుటుంబ సభ్యులకు కూడా ముందుగా సమాచారం అందించారు. శనివారం మధ్యాహ్నం దాటినా మత్స్యకారులు తిరిగి రాకపోవడం, వారి మొబైల్ ఫోన్లు అన్నీ స్విచ్ఛాఫ్ రావడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు తక్షణమే మెరైన్ పోలీస్, ఇండియన్ కోస్ట్ గార్డ్ అధికారులను ఆశ్రయించారు. మత్స్యకారులు తమ వేట ముగించుకుని తిరిగి వస్తున్న క్రమంలోనే వాతావరణం ఒక్కసారిగా మారిపోయిందని..., భారీ గాలుల ధాటికి బోటు అదుపుతప్పి సముద్రంలో మునిగిపోయి ఉంటుందని లక్ష్మణ్ రావు పేర్కొన్నారు. రుతుపవనాల ప్రభావంతో సుమారు 400 బోట్లు వేటకు వెళ్లగా.... మారుతున్న వాతావరణం. ఈదురుగాలుల వల్ల పలు బోట్లు ఇబ్బందులు ఎదుర్కొన్నాయని ఆయన తెలిపారు.

### ముమ్మరంగా రెస్క్యూ ఆపరేషన్

మత్స్యకారుల గల్లంతు ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించారు. విశాఖపట్నంలోని ఉన్నతాధికారులతో ఆయన ఫోన్ లో మాట్లాడి... సహాయక చర్యల పురోగతిని సమీక్షించారు. గల్లంతైన వారిని వీలైనంత త్వరగా గుర్తించేందుకు కోస్ట్ గార్డ్ నౌకలతో పాటు భారత నౌకాదళానికి చెందిన ప్రత్యేక హెలికాప్టర్లను రంగంలోకి దించాలని సీఎం ఆదేశించారు. మెరైన్ పోలీస్, వైజాగ్ సిటీ పోలీస్ యంత్రాంగాలు పరస్పర సమన్వయంతో సముద్రంలో గాలింపు చర్యలను ముమ్మరం చేయాలని, రెస్క్యూ ఆపరేషన్ అప్‌డేట్స్‌ను తనకు ఎప్పటికప్పుడు నివేదించాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ ఘటనపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆందోళన వ్యక్తం చేశారు. విశాఖపట్నం జిల్లా కలెక్టర్ తో ఫోన్ లో మాట్లాడి ఘటన వివరాలు.... గాలింపు చర్యల వివరాలు తెలుసుకున్నారు. మత్స్యకారుల ఆచూకీ కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మెరైన్ పోలీసులు, కోస్టు గార్డు, నేవీ సహకరంతో సముద్రంలో విస్తృతంగా గాలింపు కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఇప్పటికే నేవీకి చెందిన హెలీకాప్టర్ తో గాలింపు చేపట్టినట్టు కలెక్టర్ వివరించారు. సహాయక చర్యలను నిరంతరం పర్యవేక్షిస్తూ వివరాలు తెలియజేయాలని నిర్దేశించారు. గల్లంతైన మత్స్యకారులను రక్షించేందుకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తుందని ఆందోళన చెందవద్దని వారి కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు.



### 116 ఏళ్ల బామ్మకు

# వీఐపీ బ్రేక్ దర్శనం

(తిరుమల - జయజయహే)

116 ఏళ్ల వయసులోనూ శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం కోసం కాలినడకన తిరుమలకు చేరుకున్న వృద్ధ భక్తురాలు నవనీతమ్మకు టీటీడీ ప్రత్యేక అవకాశం కల్పించింది. ఆమెతో పాటు కుటుంబ సభ్యులకు సోమవారం ఉదయం వీఐపీ బ్రేక్ దర్శనం ఏర్పాటు చేస్తున్నట్లు తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు ప్రకటించారు. ఈ సందర్భంగా సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో స్పందించిన బీఆర్ నాయుడు.. ఈ వయసులోనూ నవనీతమ్మ చూపించిన భక్తి, సంకల్పం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని పేర్కొన్నారు. ఆమెకు శ్రీవారి ఆశీస్సులు లభించి సంపూర్ణ ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఆమెతో పాటు కుటుంబ సభ్యులకు ప్రత్యేక దర్శనం కల్పించడం తనకు సంతోషంగా ఉందని తెలిపారు. శనివారం అలిపిరి నడక మార్గం ద్వారా నవనీతమ్మ తిరుమలకు చేరుకున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. అయితే తొలుత ఆమె వివరాలు స్పష్టంగా తెలియకపోవడంతో కర్ణాటకకు చెందిన భక్తురాలిగా ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో బీఆర్ నాయుడు స్వయంగా స్పందించి, వృద్ధురాలి వివరాలు తెలిసిన వారు టీటీడీని సంప్రదించాలని కోరారు. అనంతరం తితిదే విజిలెన్స్ సిబ్బంది విచారణ చేపట్టి, ఆమె తమిళనాడుకు చెందిన నవనీతమ్మ అని గుర్తించారు. ప్రస్తుతం తిరుపతి జీవకోనలోని బంధువుల వద్ద ఉంటున్నట్లు నిర్ధారించారు. వృద్ధురాలి వివరాలు కన్ఫామ్ అయిన వెంటనే ఆమెకు, ఆమె కుటుంబ సభ్యులకు సోమవారం ఉదయం శ్రీవారి వీఐపీ బ్రేక్ దర్శనం కల్పించాలని టీటీడీ నిర్ణయం తీసుకుంది. నవనీతమ్మ భక్తి ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లోనే కాకుండా భక్తుల్లోనూ చర్చనీయాంశంగా మారింది.

# వాయుగుండం ఒడిశా తీరంలో కేంద్రీకృతం

### ఉరుములతో కూడిన వర్ష సూచన

(అమరావతి - జయజయహే)

విపత్తు నిర్వహణ సంస్థ మరోసారి వర్ష సూచనలు జారీ చేసింది. వాయువ్య బంగాళాఖాతం, ఉత్తర ఒడిశా-పశ్చిమ బెంగాల్ తీర ప్రాంతాల్లో వాయుగుండంగా కేంద్రీకృతమై ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ వెల్లడించారు. ఇది ప్రస్తుతానికి బాలాసోర్ (ఒడిశా)కు 40 కి.మీ., చాంద్‌బలి (ఒడిశా)కు 50 కి.మీ., దిఘా (పశ్చిమ బెంగాల్)కు 70 కి.మీ దూరంలో ఉందని తెలిపారు. పశ్చిమ-వాయువ్య దిశగా కదులుతూ రాబోయే 12 గంటల్లో చాంద్‌బలి -- దిఘా మధ్య బాలాసోర్ సమీపంలో ఉత్తర ఒడిశా తీరాన్ని దాటే అవకాశం ఉం దన్నారు. ఆతదుపరి 24 గంటల్లో ఇది ఉత్తర ఒడిశా,ఛత్తీస్‌గఢ్ మీదుగా కదిలే అవకాశం ఉందన్నారు. దీని ప్రభావంతో సోమవారం విజయనగరం, మన్యం,అల్లూరి, పల్నాడు జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, మిగతా జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. తీరం వెంబడి గంటకు 40-50 కిమీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లరాదని హెచ్చరించారు. ఈదురుగాలులు, ఉరుములతో వర్షం పడే సమయంలో ప్రజలు చెట్ల క్రింద, భారీ హోర్డింగ్స్ వద్ద నిలబడొద్దని సూచించారు. అవసరం అయితే తప్పా ఎవరూ బయటకు వెళ్లవద్దని తెలిపారు. భారీ వర్షాలు, ఈదురుగాలుల నేపథ్యంలో చెల్లు, విద్యుత్ స్థంభాలు విరిగి పడే అవకాశం ఉందని.. పొలాలకు వెళ్లే సమయంలో రైతులు జాగ్రత్తగా ముందు చూస్తూ వెళ్లాలని సూచించారు. ఎక్కడైనా విద్యుత్ స్థంబాలు విరిగి పడితే వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు తెలియజేయాలని సూచించారు.

# ఉప ప్రధానిగా అమిత్ షా..?

మొదటి పేజీ తరువాయి...



బాధ్యతలు అప్పగించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు జాతీయ మీడియాతోపాటు బీజేపీ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది. ఇటీవల అమిత్ షా నివాసంలో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్, పార్టీ అధ్యక్షుడు నితిన్ నబీన్ సమావేశం అయినట్లు సమాచారం. అంతకుముందు కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నివాసంలోకూడా పార్టీ ముఖ్య నేతలు సమావేశమైనట్లు తెలిసింది. బీజేపీ వర్గాల సమాచారం మేరకు.. అమిత్ షాను ఉప ప్రధానిగా నియమించడం ద్వారా ప్రభుత్వంలో ఆయన పాత్రను మరింత విస్తృతం చేయాలనే ఆలోచనలో బీజేపీ పెద్దలు ఉన్నట్లు సమాచారం. గతంలో వాజ్‌పేయి ప్రధానిగా ఉన్న సమయంలో ఎల్‌కే అద్వానీ ఉప ప్రధానిగా పనిచేశారు. వాజ్‌పేయి తరువాత ఎల్‌కే అద్వానీ ప్రధాని అభ్యర్థిగా ముందుండి పోటీ చేసినా అధికారంలోకి రాలేకపోయారు. అయితే, ఎన్డీయే 2014 నుంచి అధికారంలో కొనసాగుతోంది.. వరుసగా మూడు ఎన్నికల్లో విజయం సాధించింది. అయితే, నాల్గోసారి అధికారంలోకి వచ్చేందుకు బీజేపీ అధిష్టానం ఇప్పటి నుంచే ప్లాన్ రెడీ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే అమిత్ షాకు ఉప ప్రధాని బాధ్యతలు అప్పగించడం ద్వారా ఎన్డీయే భవిష్యత్తుకు మరింత బలమైన బాటలు వేయవచ్చునని బీజేపీ పెద్దలు భావిస్తున్నారట. ప్రధాని నరేంద్ర మోదీ తరువాత ఎవరనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. మోదీ తరువాత ఆయన స్థానాన్ని భర్తీ చేసేందుకు పలు పేర్లు తెరపైకి వస్తున్నాయి. ఈ క్రమంలో బీజేపీతోపాటు భాగస్వామ్య పక్షాల్లోనూ కాస్త గందరగోళం ఏర్పడినట్లు తెలుస్తోంది. ఈ గందరగోళానికి చెక్ పెట్టేందుకు త్వరలో జరగబోయే కేంద్ర కేబినెట్ పునర్ వ్యవస్థీకరణలో ఉప ప్రధానిగా అమిత్ షాకు బాధ్యతలు అప్పగించేందుకు బీజేపీ అధిష్టానం రంగం సిద్ధంచేసినట్లు సమాచారం. తద్వారా ప్రధాని నరేంద్ర మోదీ తరువాత అమిత్ షానే అనే సంకేతాలను ఇవ్వడంతోపాటు.. మరొకరు ఎవరూ కూడా ప్రధాని రేసులోకి రాకుండా చేసే ఎత్తుగడలో భాగంగానే ఉప ప్రధాని పదవికి అమిత్ షాను ఎంపిక చేయబోతున్నారని సమాచారం.

# రౌడీషీటర్లకు పోలీసుల కౌన్సెలింగ్





### నేరాలకు దూరంగా ఉండాలని హెచ్చరిక

**రాజమహేంద్రవరం, జయజయహే ప్రతినిధి:**

జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు ప్రాధాన్యత ఇస్తున్న తూర్పుగోదావరి జిల్లా పోలీసులు రౌడీషీటర్లు, నేరచరిత్ర కలిగిన వ్యక్తులకు ప్రత్యేక కౌన్సెలింగ్ కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈ కార్యక్రమాలు చేపట్టినట్లు పోలీసు అధికారులు తెలిపారు.కౌన్సెలింగ్ సందర్భంగా రౌడీషీటర్లు, క్రైమ్ సస్పెక్ట్‌లకు నేరాలకు దూరంగా ఉండాలని, సత్ప్రవర్తనతో సమాజంలో గౌరవప్రదమైన జీవితం గడపాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలు, గొడవలు, బెదిరింపులు, చట్టవ్యతిరేక చర్యల్లో పాల్గొంటే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ముఖ్యంగా గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం, రవాణా లేదా విక్రయాలకు పాల్పడితే కఠిన చట్టాల కింద కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.చెడు వ్యసనాలను పూర్తిగా విడిచిపెట్టి మంచి నడవడికను అలవర్చుకోవాలని, సమాజంలో శాంతిభద్రతలకు భంగం కలిగించే చర్యలకు దూరంగా ఉండాలని అధికారులు సూచించారు. కుటుంబ సభ్యుల బాధ్యతలను గుర్తించి చట్టబద్ధమైన మార్గంలో జీవనం సాగించాలని కౌన్సెలింగ్‌లో వివరించారు. జిల్లాలో రౌడీషీటర్లు, నేరచరిత్ర గల వ్యక్తుల కదలికలపై పోలీసులు నిరంతరం నిఘా ఉంచుతున్నారని, వారి కార్యకలాపాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ఎలాంటి నేరాలకు పాల్పడినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు కూడా తమ ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తులు లేదా చట్టవ్యతిరేక కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని పోలీసులు కోరారు. ప్రజల సహకారంతో నేరరహిత, ప్రశాంత సమాజ నిర్మాణమే లక్ష్యంగా ఈ కౌన్సెలింగ్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.




## నిడదవోలుకు విశాఖ-ముంబై ఎల్‌టిటి ఎక్స్‌ప్రెస్ హాల్ట్

### రాజమండ్రి ఎంపీ పురంధేశ్వరి కృషి

**రాజమహేంద్రవరం, జయజయహే ప్రతినిధి:**



నిడదవోలు, పరిసర ప్రాంతాల ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న రైల్వే డిమాండ్‌కు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. భారతీయ జనతా పార్టీ (బీజేపీ) రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి చేసిన నిరంతర కృషి ఫలితంగా విశాఖపట్నం--ముంబై లోకమాన్య తిలక్ టెర్మినస్ (ఎల్‌టిటి) ఎక్స్‌ప్రెస్ (18519/18520) రైళ్లకు నిడదవోలు రైల్వే స్టేషన్‌లో అధికారిక హాల్ట్ మంజూరైంది.నిడదవోలు జంక్షన్‌లో ఈ రైళ్లు ఆగేలా చేయాలని స్థానిక ప్రజలు చాలా కాలంగా కోరుతూ వస్తున్నారు. ఈ అంశాన్ని ఎంపీ పురందేశ్వరి కేంద్ర రైల్వే శాఖ దృష్టికి తీసుకెళ్లి, నిడదవోలు ప్రాంత ప్రజల ప్రయాణ అవసరాలు, పెరుగుతున్న రద్దీ, ముంబైతో ఉన్న వ్యాపార, విద్యా, ఉద్యోగ సంబంధాలను వివరిస్తూ ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. ఆమె చేసిన ప్రయత్నాలను సానుకూలంగా పరిశీలించిన కేంద్ర ప్రభుత్వం ఈ రైళ్లకు నిడదవోలులో హాల్ట్ కల్పిస్తూ నిర్ణయం తీసుకుంది.ఈ సందర్భంగా ఎంపీ పురందేశ్వరి మాట్లాడుతూ, ప్రజల చిరకాల ఆకాంక్షను నెరవేర్చిన నరేంద్ర మోదీ, కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, రైల్వే బోర్డు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా దేశవ్యాప్తంగా రైల్వే సేవలను విస్తరించడం, మౌలిక వసతులను అభివృద్ధి చేయడం కేంద్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.రైల్వే శాఖ విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం, ముంబై లోకమాన్య తిలక్ టెర్మినస్--విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ (18520) ప్రతిరోజూ ఉదయం 5:25 గంటలకు నిడదవోలు జంక్షన్‌కు చేరుకుని 5:32 గంటలకు బయలుదేరుతుంది. అలాగే విశాఖపట్నం--ముంబై ఎల్‌టిటి ఎక్స్‌ప్రెస్ (18519) ప్రతిరోజూ తెల్లవారుజామున 2:20 గంటలకు చేరుకుని 2:22 గంటలకు బయలుదేరనుంది. ఈ హాల్ట్ అమలులోకి రావడం ద్వారా గోదావరి జిల్లాల ప్రజలకు ముంబైతో నేరుగా మెరుగైన రైల్వే అనుసంధానం లభించనుంది. ముఖ్యంగా వ్యాపారులు, విద్యార్థులు, ఉద్యోగులు, వైద్య అవసరాల కోసం ప్రయాణించే ప్రయాణికులకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఎంపీ పురందేశ్వరి తెలిపారు. ఈ నిర్ణయంపై నిడదవోలు, పరిసర ప్రాంతాల ప్రజలు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ ఎంపీ పురందేశ్వరికి అభినందనలు తెలియజేశారు.

## మీ సంతృప్తే మా లక్ష్యం

### ప్రయాణికులకు ఆర్టీసీ అవగాహన

**రాజమహేంద్రవరం, జయజయహే ప్రతినిధి:**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ఆర్టీసీ) ఆధ్వర్యంలో చేపట్టిన "మీ సంతృప్తి మా లక్ష్యం -- మా సేవలకు మీ ప్రోత్సాహం" ప్రచార కార్యక్రమంలో భాగంగా ఆదివారం రాజమహేంద్రవరం బస్ స్టేషన్‌లో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా ప్రజా రవాణా అధికారి వై.ఎస్.ఎన్. మూర్తి దూర ప్రాంతాలకు వెళ్లే బస్సుల్లో ప్రయాణిస్తున్న ప్రయాణికులకు కరపత్రాలను పంపిణీ చేసి, అందులో పొందుపరిచిన అంశాలను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, గత 58 సంవత్సరాలుగా ఏపీఎస్ఆర్టీసీ ప్రయాణికులకు సురక్షితమైన, విశ్వసనీయమైన రవాణా సేవలను అందిస్తూ ప్రజల విశ్వాసాన్ని సంపాదించుకుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'స్త్రీ శక్తి' పథకం వల్ల మహిళా ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగినప్పటికీ, ప్రయాణికులందరికీ మరింత నాణ్యమైన సేవలు అందించేందుకు సంస్థ నిరంతరం కృషి చేస్తోందని చెప్పారు.బస్ స్టేషన్లలో పరిశుభ్రమైన వేచి ఉండే ప్రదేశాలు, సౌకర్యవంతమైన సీటింగ్, ఫ్యాన్లు, లైటింగ్, ఆర్.ఓ. తాగునీటి సదుపాయం, మహిళలు, పురుషులకు ప్రత్యేక మరుగుదొడ్లు, ప్రయాణికుల సమాచార కేంద్రం, టికెట్ బుకింగ్ కౌంటర్లు, బస్సుల రాకపోకల సమాచార బోర్డులు, దివ్యాంగుల కోసం వీల్‌చైర్లు, వాహనాల పార్కింగ్ వంటి సౌకర్యాలను అందుబాటులో ఉంచామని తెలిపారు.ప్రయాణికులు సేవల్లో ఏవైనా లోపాలు గమనిస్తే బస్ స్టేషన్‌లోని ఫిర్యాదు పుస్తకంలో నమోదు చేయాలని లేదా ఏపీఎస్ఆర్టీసీ సెంట్రల్ కంప్లైంట్ సెల్ నంబర్లు 0866-2570005 లేదా 149 ద్వారా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. అలాగే బస్ స్టేషన్లలో ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్ను స్కాన్ చేసి ఐవీఆర్ఎస్ ఫీడ్‌బ్యాక్ సర్వేలో పాల్గొని తమ అభిప్రాయాలను తెలియజేయాలని కోరారు.ప్రజలందరూ ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించి, సంస్థ అందిస్తున్న కార్గో సేవలను కూడా వినియోగించుకోవాలని జిల్లా ప్రజా రవాణా అధికారి మూర్తి విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం డిపో మేనేజర్ కె. మాధవ్, అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) ఎం. అజయ్ బాబు తదితర అధికారులు పాల్గొన్నారు.







## కోట సత్తెమ్మ తల్లి అమ్మవారి ఆలయంలో భక్తులకు శక్తి యాప్‌పై అవగాహన

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి:**

తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు, కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్ సారథ్యంలో, నిడదవోలు సీఐ తిలక్ పర్యవేక్షణలో కొవ్వూరు జోన్ నిడదవోలు సర్కిల్ శక్తి టీమ్ ఆధ్వర్యంలో తిమ్మారాజుపాలెంలోని శ్రీ కోట సత్తెమ్మ తల్లి అమ్మవారి ఆలయం వద్ద భక్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శక్తి టీమ్ ఏఎస్ఐ గంగాధరరావు, మహిళా కానిస్టేబుల్ శాంతి సుమారు 50 మంది భక్తులకు శక్తి యాప్ ఉపయోగాలు, మహిళల భద్రత, చిన్నారుల రక్షణ, ఒంటరిగా ప్రయాణించే మహిళలకు శక్తి యాప్ అందించే అత్యవసర సేవల గురించి వివరించారు.అలాగే సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఓటీపీలు, ఆధార్ వివరాలు, అనుమానాస్పద ఏపీకే లింకులు ఎవరికీ ఇవ్వకూడదని, ఫోటో మార్ఫింగ్, ఆన్‌లైన్ లోన్ మోసాలు, ఇతర సైబర్ నేరాల నుంచి ఎలా రక్షించుకోవాలో సూచించారు. ప్రయాణాల సమయంలో విలువైన నగలు, నగదు, ఇతర వస్తువులను బ్యాగుల్లో నిర్లక్ష్యంగా ఉంచకూడదని, చిన్నారులను ఒంటరిగా వదిలేయరాదని తెలిపారు.అదేవిధంగా గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం లేదా విక్రయాల గురించి సమాచారం తెలిసిన వెంటనే భయపడకుండా పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు.ఈ అవగాహన కార్యక్రమంలో దేవస్థానం సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, దేవస్థానం సిబ్బంది శక్తి టీమ్‌కు సహకరించి కార్యక్రమం విజయవంతం కావడానికి తమ వంతు సహాయాన్ని అందించారు.

## చికెన్ @ రూ. 340

సరఫరా లోపం, పెరిగిన డిమాండ్ వంటి కారణాలతో మార్కెట్‌లో ధరలు ఎగబాకుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు.. అటు ఆంధ్రప్రదేశ్, ఇటు తెలంగాణలోని పలు ప్రాంతాల్లో చికెన్ ధరలు రికార్డు స్థాయికి చేరుకున్నాయి. కొన్ని రోజుల క్రితం కిలో రూ. 250 లోపు లభించిన చికెన్.. ప్రస్తుతం రూ.340 వరకు విక్రయిస్తున్నారు. డ్రెస్డ్ చికెన్ ధర కూడా భారీగా పెరిగింది. ఫారాల నుంచి వచ్చే లైవ్ బర్డ్ ధర పెరగడంతో పాటు రిటైల్ మార్కెట్‌లో అదనపు ఖర్చులు చేరి వినియోగదారులకు మరింత భారంగా మారింది. హైదరాబాద్, విజయవాడ నగరాల్లో స్కిన్ లెస్ చికెన్ ధర కేజీ రూ.340 నుంచి 350 వరకు విక్రయిస్తున్నారు. డ్రెస్సెడ్ చికెన్ కేజీ.. రూ.320 వరకు విక్రయిస్తున్నారు. బ్రాయిలర్ కోడి కేజీ.. ఫామ్ గేట్ ధర రూ.160 వరకు ఉంది. రిటైల్ మార్కెట్ లో రూ. 190 వరకు విక్రయిస్తున్నారు. కోడిగుడ్ల ధరలు కూడా అదే బాటలో పయనిస్తున్నాయి. ఇటీవల వరకు రూ.80లోపు దొరికిన డజను గుడ్లు.. ఇప్పుడు రూ.90 నుంచి 100 వరకు చేరుకున్నాయి. ఒక్కో గుడ్డు ధర రూ.8 నుంచి రూ.8.50 మధ్య పలుకుతోంది. దీంతో ప్రతిరోజూ గుడ్లు వినియోగించే కుటుంబాలు ఖర్చును తగ్గించుకునే పరిస్థితి ఎదుర్కొంటున్నాయి. వేసవి కాలం తర్వాత కోళ్ల ఉత్పత్తి తగ్గడం, పౌల్ట్రీ ఫీడ్ ధరలు పెరగడం, మార్కెట్‌లో సరఫరా తగ్గిపోవడం ధరల పెరుగుదలకు ప్రధాన కారణాలుగా వ్యాపారులు చెబుతున్నారు. మరోవైపు హోటళ్లు, రెస్టారెంట్లు, శుభకార్యాల సీజన్ కారణంగా డిమాండ్ పెరగడంతో కూడా ధరలు మరింత ఎగబాకుతున్నాయని అంటున్నారు. మార్కెట్‌లో కొంతమంది వ్యాపారుల ఆధిపత్యం కూడా ధరలపై ప్రభావం చూపుతోందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే రానున్న రోజుల్లో చికెన్, గుడ్ల ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

## విశాఖ తీరంలో గల్లంతైన మత్స్యకారుల కోసం గాలింపు

### బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ధైర్యం చెప్పిన హోం మంత్రి

**విశాఖపట్నం, జులై 5, జయ జయహే**



విశాఖ తీరంలో సముద్రంలో గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ కోసం రాష్ట్ర ప్రభుత్వం విస్తృత గాలింపు చర్యలు చేపట్టిందని హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. ఘటనపై ఆమె ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తూన్నారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు, మంత్రి కొండపల్లి శ్రీనివాస్, స్థానిక ఎమ్మెల్యేతో హోంమంత్రి ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని తెలుసుకున్నారు. అలాగే జిల్లా కలెక్టర్లు, డీఐజీలు, పోలీసు కమిషనర్, ఎస్పీలు, మత్స్యశాఖ అధికారులతో నిరంతరం సమీక్ష జరుపుతూ గాలింపు చర్యలను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. బాధిత మత్స్యకారుల కుటుంబాలకు తక్షణ సహాయ చర్యలు అందించాలని అధికారులను ఆదేశించారు. హోంమంత్రి అనిత మాట్లాడుతూ, విశాఖ తీరంలో మత్స్యకారులు గల్లంతైన ఘటన దురదృష్టకరమని అన్నారు. ఈ నెల ఒకటో తేదీన మత్స్యకారులు చేపల వేటకు సముద్రంలోకి వెళ్లారని, అనంతరం వారి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయడంతో ప్రభుత్వం పూర్తిస్థాయిలో అప్రమత్తమై గాలింపు చర్యలు ప్రారంభించిందని తెలిపారు. ఐజీ మెరైన్స్, కోస్టల్ గార్డ్ డీఐజీ, విశాఖపట్నం, విజయనగరం జిల్లాల కలెక్టర్లు, విశాఖపట్నం నగర పోలీస్ కమిషనర్, విజయనగరం ఎస్పీ, మత్స్యశాఖ అధికారులు సమన్వయంతో సహాయక చర్యలు కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. బోటు యజమాని అప్పారావు ఆచూకీ లభించిందని, బోటు తిరగబడటం వల్లే ప్రమాదం జరిగిందని ఆయన సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. నేవీ హెలికాప్టర్, మెరైన్ బోట్లు సహాయంతో గాలింపు చర్యలు నిరంతరం కొనసాగుతున్నాయని, గల్లంతైన మత్స్యకారులను సురక్షితంగా తీరానికి చేర్చేందుకు ప్రభుత్వం అన్ని విధాలా ప్రయత్నిస్తోందని హోంమంత్రి స్పష్టం చేశారు. బాధిత మత్స్యకారుల కుటుంబాలను మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే లోకం మాధవి పరామర్శించి ధైర్యం చెప్పారని, అధికారులు కూడా కుటుంబ సభ్యుల వద్దే ఉండి సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. మత్స్యకార కుటుంబాలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హోంమంత్రి అనిత భరోసా ఇచ్చారు.

# ప్రశ్న రావణ్‌పై ఉపా చట్టం

మొదటి పేజీ తరువాయి...

సార్వభౌమాధికారానికి, సమగ్రతకు తీవ్ర భంగం కలిగిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతేకాకుండా, సమాజంలో అశాంతిని రేకెత్తిస్తూ దేశద్రోహ చర్యలకు పాల్పడుతున్నాడనే ఆరోపణలతో ఈ కేసును నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ కేసులో ప్రశ్న రావణ్‌పై భారతీయ న్యాయ సంహిత ,ఉపా చట్టంలోని పలు కఠినమైన సెక్షన్లను చేర్చారు. ఇందులో ఖ/ం 147, 148, 152, 192, 197(1)(ు), 353(1)(ఎ) తో పాటు యుఏపీఏ యాక్ట్ 1967 లోని సెక్షన్ 13, సెక్షన్ 39 కింద గన్నవరం పోలీసులు కేసులు నమోదు చేశారు. వరుసగా బెయిళ్లు వస్తున్న నేపథ్యంలో, అతన్ని అదుపులో ఉంచేందుకే పోలీసులు ఈ తీవ్రమైన సెక్షన్లను ప్రయోగించారని అతడి లాయర్ జడ శ్రవణ్ కుమార్, వైఎస్సార్ సీపీ నేతలు ఆరోపిస్తున్నారు. ప్రశ్నించే వారి గొంతు నొక్కేందుకు కూటమి ప్రభుత్వం ఇలాంటి పిచ్చి పనులు చేస్తుందని విమర్శించారు. నటుడు ప్రకాష్ రాజ్ సైతం ప్రశ్న రావణ్‌కు మద్దతు తెలిపారు. పవన్ కళ్యాణ్‌ను ప్రశ్నించాడని ఓ వ్యక్తిని పదే పదే అరెస్ట్ చేస్తున్నా కోర్టులు బెయిల్ ఇవ్వడం నిజం కాదా అని ప్రశ్నించారు. రావణ్‌పై నమోదైనవి ఉద్దేశపూర్వకంగానే పెట్టిన కేసులు అని ఆరోపించారు.

**అత్యంత కఠినమైన సెక్షన్లతో కేసు**

యూట్యూబర్ ప్రశ్న రావణ్ అరెస్ట్, ఆయనపై మోపిన సెక్షన్ల గురించి ఆయన తరపు న్యాయవాది జడ శ్రవణ్ కుమార్ చేసిన వ్యాఖ్యలు.. గన్నవరం పోలీసులు రావణ్‌పై



ఎఫ్ఐఆర్ నంబర్ 188/2026 కింద అత్యంత కఠినమైన సెక్షన్లతో కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారని జడ శ్రవణ్ కుమార్ తెలిపారు. రావణ్‌పై సెక్షన్ 147, 148, 152, 192, 197, ఉపా (ఖ్యూ్రాూ) చట్టంలోని సెక్షన్ 39 కింద కేసులు పెట్టారని ఆయన వివరించారు. ముఖ్యంగా సెక్షన్ 147 అనేది ప్రభుత్వంపై యుద్ధం ప్రకటించడం లేదా దానికి ప్రయత్నించడం వంటి నేరాలకు వర్తిస్తుందని, దీనివల్ల మరణశిక్ష లేదా జీవిత ఖైదు పడే అవకాశం ఉంటుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గరిపాటి శివశంకర్ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఈ కేసు నమోదైనట్లు శ్రవణ్ కుమార్ పేర్కొన్నారు. జూన్ 28, 2026న గన్నవరంలో జరిగిన ఒక కార్యక్రమంలో రావణ చేసిన ప్రసంగం నిషేధిత సిపిఐ మావోయిస్టు సంస్థను కీర్తించేలా ఉందని, యువతను తీవ్రవాద భావజాలం వైపు ప్రేరేపించేలా ఉందని పోలీసులు ఆరోపిస్తున్నట్లు తెలిపారు. అయితే, ఆ సభలో పవన్ కళ్యాణ్‌ను విమర్శిస్తూ మాట్లాడారే తప్ప, మావోయిస్టుల ప్రస్తావన ఎక్కడా రాలేదని న్యాయవాది స్పష్టం చేశారు

**ప్రభుత్వ వైఖరిపై విమర్శలు**

రావణ్‌పై ఉన్న పాత సోషల్ మీడియా కేసుల్లో బెయిల్ వస్తుండటంతో, ఆయనను ఎలాగైనా జైలులోనే ఉంచాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ చీకటి ఒప్పందం చేసుకుందని శ్రవణ్ కుమార్ విమర్శించారు. రావణ్‌పై ఉన్న సుమారు 102 కేసుల్లో వరుసగా పిటి వారెంట్లు వేస్తూ, ఒకటి రెండు ఏళ్ల పాటు ఆయనను జైలుకే పరిమితం చేయాలనేది ప్రభుత్వ కుట్ర అని ఆయన మండిపడ్డారు. ఒక యూట్యూబర్‌ను దేశద్రోహిగా, తీవ్రవాదిగా చిత్రీకరించడం ప్రజాస్వామ్య విరుద్ధమని ఆయన పేర్కొన్నారు. పోలీసులు సమర్పించిన వీడియో ఆధారాలు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి సాంకేతికతతో మానిప్యులేట్ చేసినవి అయి ఉండవచ్చని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. ప్రశ్నించే గొంతుకను అణచివేయడానికి 164 సీట్లను, అధికార బలాన్ని వాడుకుంటున్నారని, ఈ అప్రజాస్వామిక చర్యలకు ప్రజలు 2029 ఎన్నికల్లో తగిన సమాధానం చెబుతారని జడ శ్రవణ్ కుమార్ హెచ్చరించారు.

For a pure tomorrow.. జయహో

### ఆదిశక్తి మాత దివ్య నామము....!!

## తాంబూలప్రియ

### తమలపాకు...!!! తాంబూల ప్రియ...!!!!

(పుట్టా శ్రీనివాసరావు)




భారతీయ సంప్రదాయంలో, తమలపాకు కేవలం అతిథ్యానికి లేదా అలంకరణకు చిహ్నం మాత్రమే కాదు, అది జీవితంలోని సకల సారాలకు ప్రతీక. భౌతిక , ఆధ్యాత్మిక జీవితాల మధ్య సమతుల్యతను నెలకొల్పడం ద్వారా పరిపూర్ణత కోసం కృషి చేయాలని ఇది సూచిస్తుంది.

ఆదిశక్తి మాత దివ్య నామాలలో ఒకటి "తాంబూలప్రియ," అంటే ఆమె తమలపాకును ప్రియంగా భావిస్తుంది. అయితే, ఇందులో ఒక ప్రగాఢమైన ఆధ్యాత్మిక రహస్యం ఇమిడి ఉంది. అమ్మవారికి ప్రియమైన తమలపాకు భౌతికమైనది కాదు, దివ్యమైనది--- అది కేవలం ఒకే సారాన్ని, అంటే అమృత తత్వ సారాన్ని మాత్రమే కలిగి ఉంటుంది.

ఒక భక్తుడు సంపూర్ణ భక్తి, ప్రేమ మ ఏకాగ్రతతో అమ్మవారి దివ్య నామాలను జపిస్తూ, ఆమె ఆరాధనలో లీనమై చైతన్యపు హద్దులను అధిగమించినప్పుడు, అతను సహస్రార చక్రం నుండి దివ్య అమృతాన్ని అనుభవిస్తాడు. యోగ శాస్త్రంలో దీనిని అమృతధార లేదా అమృతతత్వం అని అంటారు. ఈ దివ్య సారం సాధకుడి శరీరాన్ని, మనస్సును, ఆత్మను ఆనందం, శాంతి పరమ చైతన్యంతో నింపుతుంది.

ఈ అమృతం తాంబూలప్రియ మాతకు అత్యంత ప్రియమైనది. అంటే, బాహ్య ఆడంబరం కంటే కూడా, సాధకుడి యొక్క శుద్ధ భక్తి, నిస్వార్థ ప్రేమ, ఆత్మ సాక్షాత్కారమనే అమృతాన్ని అమ్మవారు ఎక్కువగా ఆస్వాదిస్తారు. సాధకుడు స్వయంగా చైతన్యమనే అమృతంలో స్థిరపడినప్పుడు మాత్రమే, అతని ఆరాధన అమ్మవారికి నిజంగా ప్రియమైనదిగా మారుతుంది.

ఈ విధంగా, "తాంబూలప్రియ" అనే నామం మనకు ఇచ్చే సందేశం ఏమిటంటే, అమ్మవారి నిజమైన ఆనందం బాహ్య నైవేద్యాల ద్వారా కాకుండా, మనస్సాక్షి శుద్ధత, అవిచ్ఛిన్నమైన భక్తి మరియు ఆధ్యాత్మిక అమృతానుభూతి ద్వారా లభిస్తుంది. ఇదే సాధన అంతిమ రహస్యం . అమ్మవారి ఆరాధన అత్యున్నత లక్ష్యం.

# కృత్రిమ మేధస్సు ఆధారిత పోలీసింగ్

## నేర నియంత్రణలో సాంకేతికత పాత్ర

(సి.హెచ్.ప్రతాప్)

**ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా కృత్రిమ మేధస్సు అనేక రంగాల్లో విప్లవాత్మక మార్పులకు దారితీస్తోంది. విద్య, వైద్యం, వ్యవసాయం, రవాణా, పరిశ్రమలతో పాటు పోలీసు వ్యవస్థలో కూడా దీని వినియోగం వేగంగా పెరుగుతోంది. నేరాలను ముందుగానే గుర్తించడం, నిందితులను వేగంగా పట్టుకోవడం, దర్యాప్తును సులభతరం చేయడం, ప్రజలకు మెరుగైన భద్రత కల్పించడం వంటి అంశాల్లో కృత్రిమ మేధస్సు కీలక పాత్ర పోషిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌తో పాటు దేశంలోని పలు రాష్ట్రాలు ఆధునిక సాంకేతికతను పోలీసింగ్‌లో ప్రవేశపెట్టి ప్రజా భద్రతను మరింత బలోపేతం చేయడానికి చర్యలు చేపడుతున్నాయి.**




కృత్రిమ మేధస్సు ఆధారిత పోలీసింగ్‌లో తెలివైన నిఘా కెమెరాలు, ముఖ గుర్తింపు వ్యవస్థలు, వాహన సంఖ్య గుర్తింపు విధానాలు, సమాచార విశ్లేషణ పద్ధతులు ప్రధానంగా ఉపయోగించబడుతున్నాయి. ఇవి అనుమానాస్పద కదలికలను వెంటనే గుర్తించడం, నేరస్థుల ప్రయాణ మార్గాలను గుర్తించడం, దొంగిలించబడిన వాహనాలను కనిపెట్టడం, నేరాలకు సంబంధించిన ఆధారాలను వేగంగా సేకరించడం వంటి పనులను సమర్థంగా నిర్వహిస్తాయి. దీనివల్ల పోలీసుల పనిభారం తగ్గడంతో పాటు దర్యాప్తు వేగం, నాణ్యత రెండూ మెరుగుపడుతున్నాయి.

ప్రజల భద్రతను కాపాడడంలో ఈ సాంకేతికత ఎంతో ఉపయోగకరంగా మారింది. జనసమ్మర్ద ప్రాంతాలు, విద్యాసంస్థలు, రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, విమానాశ్రయాలు వంటి ప్రదేశాల్లో నిరంతర నిఘా సాధ్యమవుతోంది. కనిపించకుండా పోయిన చిన్నారులు, వృద్ధులను గుర్తించడం, మహిళల భద్రతను మెరుగుపరచడం, అత్యవసర పరిస్థితుల్లో తక్షణ స్పందన అందించడం వంటి అంశాల్లో కూడా కృత్రిమ మేధస్సు విశేషంగా తోడ్పడుతోంది. అలాగే రహదారి రవాణా నియంత్రణ, ప్రమాదాల నివారణ, ప్రకృతి విపత్తుల సమయంలో సహాయక చర్యల సమన్వయంలో కూడా దీని పాత్ర పెరుగుతోంది.

అయితే కృత్రిమ మేధస్సు వినియోగంతో కొన్ని సవాళ్లు కూడా ఎదురవుతున్నాయి. వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగే అవకాశం, సేకరించిన సమాచారాన్ని దుర్వినియోగం చేసే ప్రమాదం, సమాచార భద్రతకు ముప్పు, సాంకేతిక లోపాల వల్ల అమాయకులు ఇబ్బందులు పడే అవకాశం వంటి అంశాలు ఆందోళన కలిగిస్తున్నాయి. కొన్నిసార్లు ముఖ గుర్తింపు వ్యవస్థలు పొరపాట్లు చేసే అవకాశం ఉండటంతో నిర్దోషులు అనుమానితులుగా మారే ప్రమాదం కూడా ఉంది. అందువల్ల కృత్రిమ మేధస్సుపై మాత్రమే పూర్తిగా ఆధారపడకుండా మానవ వివేకం, అనుభవం, చట్టపరమైన పర్యవేక్షణతో కలిపి ఉపయోగించడం అవసరం.

ఈ నేపథ్యంలో ప్రభుత్వం స్పష్టమైన చట్టపరమైన మార్గదర్శకాలను రూపొందించాలి. సమాచార భద్రత, గోప్యత పరిరక్షణ, పారదర్శకత, బాధ్యతాయుత వినియోగానికి ప్రాధాన్యం ఇవ్వాలి. పోలీసు సిబ్బందికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై నిరంతర శిక్షణ అందించడంతో పాటు ప్రజల్లో కూడా అవగాహన పెంచాలి. సాంకేతిక వ్యవస్థల పనితీరును స్వతంత్ర సంస్థల ద్వారా కాలానుగుణంగా సమీక్షించి లోపాలను సరిదిద్దే విధానాన్ని అమలు చేయాలి. ప్రజల విశ్వాసాన్ని పెంపొందించే చర్యలకు కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాలి.

మొత్తానికి కృత్రిమ మేధస్సు ఆధారిత పోలీసింగ్ నేర నియంత్రణలో ఒక శక్తివంతమైన సాధనం. ఇది పోలీసుల సామర్థ్యాన్ని పెంచి, నేరాల ఛేదనను వేగవంతం చేసి, ప్రజలకు మరింత భద్రతను అందించే సామర్థ్యాన్ని కలిగి ఉంది. అయితే సాంకేతికతతో పాటు చట్టబద్ధత, పారదర్శకత, గోప్యత పరిరక్షణ, మానవ హక్కుల గౌరవం వంటి విలువలను సమానంగా కాపాడినప్పుడే ఈ విధానం తన లక్ష్యాన్ని పూర్తిగా సాధిస్తుంది. సాంకేతికతను ప్రజాహిత దృక్పథంతో వినియోగించడం ద్వారా సు-రక్షితమైన, శాంతియుతమైన, నేరరహిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుంది.

# మనసే దేవాలయం... భావమే నైవేద్యం

(సి.హెచ్.ప్రతాప్)

**దేవుడిని దర్శించడానికి ఆలయాలకు వెళ్లడం భారతీయ సంస్కృతిలో ఒక పవిత్ర సంప్రదాయం. అయితే శాస్త్రాలు చెప్పే గొప్ప సత్యం ఏమిటంటే, భగవంతుడు కేవలం గర్భగుడిలోనే కాదు, నిర్మలమైన మనస్సులో కూడా నివసిస్తాడు. అందుకే పెద్దలు "మనసే దేవాలయం" అని చెప్పారు. మన హృదయం పవిత్రంగా ఉంటే, ప్రతి ఆలోచన పూజగా, ప్రతి మాట మంత్రంగా, ప్రతి సత్కార్యం యజ్ఞంగా మారుతుంది.**




భగవద్గీతలో శ్రీకృష్ణుడు "పత్రం పుష్పం ఫలం తోయం యో మే భక్త్యా ప్రయచ్ఛతి" అని ఉపదేశించాడు. అంటే ఒక ఆకు, ఒక పువ్వు, ఒక పండు లేదా కొద్దిగా నీరు సమర్పించినా, అది నిజమైన భక్తితో సమర్పిస్తే పరమాత్మ సంతోషంగా స్వీకరిస్తాడని అర్థం. ఇక్కడ విలువ వస్తువుకు కాదు, భావానికి ఉంది. భగవంతుడు మన సంపదను కాదు, మన సమర్పణ భావాన్ని చూస్తాడు.

రామాయణంలో శబరి కథ దీనికి చక్కని ఉదాహరణ. ఆమె రాజభోగాలు సమర్పించలేదు. అడవిలో దొరికిన పండ్లను ఒక్కొక్కటి రుచి చూసి తియ్యనివే శ్రీరాముడికి సమర్పించింది. ఆమె చర్యను సాధారణ దృష్టితో చూస్తే అది శాస్త్రవిరుద్ధంగా అనిపించవచ్చు. కానీ శ్రీరాముడు అందులోని అపారమైన ప్రేమను, అచంచలమైన భక్తిని మాత్రమే చూశాడు. అందుకే ఆమె సమర్పించిన పండ్లు అమృతం కన్నా మధురంగా అనిపించాయి.

ఈ రోజుల్లో చాలామంది భక్తిని ఆడంబరాలతో కొలుస్తున్నారు. ఖరీదైన పూజలు, పెద్ద పెద్ద హోమాలు, విలాసవంతమైన కానుకలతో దేవుని ప్రసన్నం చేసుకోవాలని భావిస్తున్నారు. కానీ మనసులో అసూయ, కోపం, అహంకారం, ద్వేషం నిండిపోయి ఉంటే ఆ పూజలకు పరిపూర్ణత ఉండదు. నిజమైన ఆరాధన అంటే మనస్సును పవిత్రంగా ఉంచడం, ఇతరులకు హాని చేయకుండా జీవించడం, సత్యాన్ని పాటించడం, దయతో ప్రవర్తించడం.

ఉపనిషత్తులు కూడా "ఈశావాస్యమిదం సర్వం" అని బోధించాయి. ఈ విశ్వంలోని ప్రతి జీవిలో పరమాత్మ ఉన్నాడని గుర్తించినప్పుడు, మన ప్రవర్తనలో సహజంగానే ప్రేమ, కరుణ, సేవాభావం పెరుగుతాయి. ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం, దుఃఖంలో ఉన్నవారిని ఓదార్చడం, బాధలో ఉన్నవారికి చేయూతనివ్వడం కూడా భగవంతుని సేవే. సేవలో కనిపించే భక్తి, మాటల్లో చెప్పే భక్తికంటే ఎంతో గొప్పది.

ప్రతిరోజూ కొద్దిసేపు ఆత్మపరిశీలన చేసుకోవాలి. నేడు నేను ఎవరికైనా సాయం చేశానా? నా మాటల వల్ల ఎవరికైనా బాధ కలిగిందా? నా ఆలోచనలు పవిత్రంగా ఉన్నాయా? అనే ప్రశ్నలను మనల్ని మనం అడిగితే జీవితం క్రమంగా మారుతుంది. మనస్సు పరిశుభ్రంగా మారిన కొద్దీ దైవానుభూతి మరింత దగ్గరవుతుంది.

దేవాలయానికి వెళ్లడం ఎంత ముఖ్యమో, మన హృదయాన్ని కూడా దేవాలయంలా నిర్మలంగా ఉంచుకోవడం అంతకంటే ముఖ్యమైనది. భగవంతుడు బంగారు గోపురాల కంటే స్వచ్ఛమైన హృదయాన్నే ఎక్కువగా ఇష్టపడతాడు. అందుకే ప్రతి రోజు మన ఆలోచనలను సత్పథంలో నడిపిస్తూ, ప్రేమను పంచుతూ, సేవను జీవిత ధర్మంగా స్వీకరిద్దాం. అప్పుడు మన జీవితం దైవకృపతో నిండిపోతుంది. నిజానికి మనసు పవిత్రమైతే, ప్రతి ఇల్లు దేవాలయమే, ప్రతి మనిషి దైవస్వరూపుడే, ప్రతి సత్కార్యం భగవంతునికి సమర్పించిన మహానైవేద్యమే.



# బిజేపిలో చేరిన జాగారపు

## కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన పివిఎన్ మాధవ్

గాజువాక (జయ జయహే)

గాజువాక నియోజకవర్గం 73వ వార్డుకి చెందిన వైసీపీ నాయకులు మరియు రాష్ట్ర బిసి (రజిక) సంఘం సభ్యులు జాగారపు శ్రీను బిజేపి తీర్థం పుచ్చుకున్నారు. బిజేపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ బిజేపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బిజేపి రాష్ట్ర మీడియా పేనలిస్ట్ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు (కేఎన్ఆర్ ) ఆధ్వర్యంలో విశాఖ పిటాపురం కోలనీ పివిఎన్ మాధవ్ క్యాంపు కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా కేఎన్ఆర్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ మథర్ తెరీసా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్,మంచి సంఘ సేవకులు జాగారపు శ్రీను తన ఆహ్వానం మేరకు బిజేపిలో చేరినందుకు చాలా సంతోషంగా ఉందని అన్నారు. బిజేపిలో చేరిన వారికి రాజకీయంగా మంచి భవిష్యత్తు ఉంటుందని అన్నారు . పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా పని చేయాలని అన్నారు. ప్రదాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశ ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను , దేశం కోసం తీసుకున్న సాహసోపేతమైన నిర్ణయాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కోరారు . జాగారపు శ్రీను మాట్లాడుతూ ప్రదాని నరేంద్ర మోదీ సుపరిపాలనను ఆకర్షితులై తాను బిజేపి లో చేరానని అన్నారు.రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్, జిల్లా అధ్యక్షులు పరశురామరాజు , గాజువాక అసెంబ్లీ ఇంచార్జ్ కేఎన్ఆర్ నాయకత్వంలో తాను పార్టీ ఇచ్చిన బాధ్యతలను తన శక్తి మేరకు చిత్తశుద్ధితో చేస్తానని తెలిపారు. పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు . వారితో పాటు పార్టీలో చేరిన సుద్దమల్ల.శ్రీను, సిరసపల్లి సందీప్, జాగారపు చిన శ్రీనులకు రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

# తల్లి అంత్యక్రియలకు నిందితుడికి అనుమతి

## మానవత్వాన్ని చాటుకున్న అనకాపల్లి జిల్లా ఎస్పీ

## పోలీస్ యంత్రాంగానికి ధన్యవాదాలు తెలిపిన కుటుంబ సభ్యులు

**మాడుగుల,జూలై 5,జయ జయ హే**



చట్టాన్ని అమలు చేయడంలోనే కాదు, ఆపదలో ఉన్నప్పుడు మానవత్వాన్ని చాటడంలోనూ తాము ఎప్పుడూ ముందే ఉంటామని అనకాపల్లి జిల్లా పోలీసులు మరోసారి నిరూపించారు. పిట్ ఎన్‌డిపిఎస్ చట్టం కింద విశాఖపట్నం సెంట్రల్ జైలులో రిమాండ్‌లో ఉన్న నిందితుడు బుదిరెడ్ల కొండలరావు ( నాగు)కు తన తల్లి అంత్యక్రియల్లో పాల్గొనేందుకు మానవతా దృక్పథంతో ఒకరోజు తాత్కాలిక బెయిల్ (పరోల్) మంజూరు చేయించడంలో అనకాపల్లి జిల్లా పోలీస్ యంత్రాంగం చూపిన చొరవపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.మాడుగుల మండలం, ఎం.కోటపాడు గ్రామానికి చెందిన బుదిరెడ్ల కొండలరావు గంజాయి అక్రమ రవాణా కేసులో నిందితుడిగా ఉంటూ, జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు 2025 జూలై 14న పిట్ ఎన్‌డిపిఎస్ చట్టం కింద అరెస్ట్ అయి విశాఖపట్నం సెంట్రల్ జైలులో రిమాండ్ అనుభవిస్తున్నాడు. కాగా, గత పది రోజులుగా తీవ్ర అనారోగ్యంతో ఉన్న అతని తల్లి బుదిరెడ్ల పైడితల్లమ్మ (50 ) మృతి చెందడంతో ఆ కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. కన్నకొడుకు జైలులో ఉండటంతో ఆఖరి చూపుకు కూడా నోచుకోలేని దైన్య స్థితిలో ఆ కుటుంబం పుట్టెడు దుఃఖంలో మునిగిపోయింది.

**పోలీసుల తక్షణ స్పందన -- మానవత్వం:**

కన్నతల్లి చివరి చూపుకైనా కొడుకును తీసుకురావాలని కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు జిల్లా పోలీసులను ఆశ్రయించారు. పరిస్థితిని అర్థం చేసుకున్న వారు తక్షణమే ఈ విషయాన్ని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా కి, అదనపు ఎస్పీ ఎల్.మోహన రావుకి నివేదించారు. పరిస్థితి తీవ్రతను, కుటుంబంలోని మానవీయ కోణాన్ని గమనించిన ఎస్పీ వెంటనే స్పందించి, హుటాహుటిన రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులకు నివేదిక పంపారు.

జిల్లా ఎస్పీ ప్రత్యేక చొరవ మరియు సిఫార్సు మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం (రెవెన్యూ ఎక్సైజ్ శాఖ) వెంటనే స్పందించి అత్యవసరంగా ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ ఉత్తర్వు ప్రకారం, నిందితుడు బుదిరెడ్ల కొండలరావుకు ఒకరోజు పాటు తల్లి అంత్యక్రియలకు హాజరయ్యేందుకు తాత్కాలిక విడుదల మంజూరు చేశారు.

ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం, తగిన పోలీస్ భద్రత నడుమ బుదిరెడ్ల కొండలరావు ఆదివారం ఎం.కోటపాడు గ్రామానికి చేరుకుని, తన తల్లి పైడితల్లమ్మ అంత్యక్రియలలో పాల్గొని అంతిమ సంస్కారాలు నిర్వహించాడు.

ఈ కష్టసమయంలో కఠినమైన చట్టపరమైన నిబంధనలు ఉన్నప్పటికీ, కేవలం మానవతా దృక్పథంతో అత్యంత వేగంగా స్పందించి, కన్నకొడుకును ఆఖరిసారి చూసుకునే భాగ్యాన్ని కల్పించినందుకు అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా కి, అదనపు ఎస్పీ ఎల్.మోహన రావు కి పోలీస్ సిబ్బందికి బుదిరెడ్ల కొండలరావు కుటుంబ సభ్యులు, తండ్రి సైదు నాయుడు మరియు ఎం.కోటపాడు గ్రామ ప్రజలు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.పోలీస్ శాఖ కేవలం శిక్షించడమే కాదు, క్లిష్ట సమయాల్లో కుటుంబానికి అండగా నిలబడి మానవత్వాన్ని కాపాడగలదని నిరూపించిన జిల్లా పోలీసుల తీరుపై గ్రామస్తులంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

---

### గిరిజన మండల కేంద్రాల్లో

# అన్నీ సమస్యలే...!

## డిప్యూటీ సీఎంకు మాజీ మంత్రి పసుపులేటి లేఖ

**విశాఖపట్నం, జూలై 5, జయ జయహే :**



పర్యాటక కేంద్రాలుగా చెప్పుకునే అన్ని మండల కేంద్రాల్లోనూ దుర్భర పరిస్థితులున్నాయని మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయా సమస్యలను పరిష్కరించాలంటూ డిప్యూటీ సీఎం,రాష్ట్ర పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి, అటవీ సంక్షేమ, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్‌కు లేఖ రాశారు. ఆ లేఖను మీడియాకు విశాఖలో విడుదల చేశారు. అందులోని సారాంశం ఇలా ఉంది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో కొన్ని ప్రధానమైన మేజర్ గ్రామ పంచాయితీ ముఖ్య కేంద్రాలు, మండల కేంద్రాలుగా కూడా ఉన్నాయి. వాటిల్లో పారిశుద్య లోపం తీవ్రంగా స్థానిక ప్రజానీకానికి వివిధ సమస్యలతో ఇబ్బంది పడుచున్నారు. అప్పర్ సీలేరు మొదలుకొని అనంతగిరి వరకు ఇదే పరిస్థితి. ఈ ప్రాంతంలో వివిధ ప్రదేశాల నుండి అనేక మంది ప్రజలు పర్యాటకులుగా వస్తుంటారు. ఉదాహరణకు అరుకు ప్రధాన పట్టణ మధ్యలో ఉన్న డివైడర్ దుస్థితి ప్రత్యక్ష సాక్షిగా నిలుస్తుంది. వేలాది మంది స్థానికులతో పాటు పర్యాటకులు వచ్చే ఈ గ్రామానికి కనీసం ఒక పబ్లిక్ టాయిలెట్ లేదు, అంటే వివక్షతో నిర్లక్ష్యమో తెలియదు. సరైన వీధి లైట్లు లేవు ముఖ్యంగా అరుకు పట్టణ మధ్యలో ఉన్న డివైడర్లో ప్రాణాంతక మొక్కలుగా పిలువబడే వయ్యారిభామ గడ్డి మొక్కలు నిండివున్నాయి కావునా పై విషయాల పట్ల ప్రజా సంక్షేమం దృష్ట్యా చర్యలు తీసుకోవాలని కోరుతూ...అంటూ బాల రాజు ముగించారు.



# ఘనంగా గురుపూజోత్సవం

**గాజువాక (జయ జయహే)**

చినగంట్యాడ పద్మశ్రీ ఫంక్షన్ హాల్లో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘం ఆధ్వర్యంలో గురు పూజోత్సవం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా గాజువాక బెస్ట్ వెస్ట్రన్ రామచంద్ర హోటల్ యజమాని గంటా రఘు,ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అనుబంధ మండలి ఛైర్మన్ పాండురంగ ప్రసాద్ పాల్గొన్నారు. ముఖ్య వక్తగా అఖిల భారతీయ సామాజిక సమరసతా సంయోజన్ శ్యామ్ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ప్రపంచ వ్యాప్తంగా నలభై శాఖలుగా విస్తరించి పలు రంగాల్లో సేవలు అందిస్తున్నాయని అన్నారు. దేశం కోసం ధర్మం కోసం పనిచేసే ఏకైక సంస్థ ఆర్ఎస్ఎస్ అని అన్నారు. అనంతరం అందరూ ద్వజానికి వందన సమర్పణ చేసారు. గాజువాక నుండి చినగంట్యాడ వరకు కాషాయ జెండాలు తోరణాలతో అలంకరించారు. కార్యక్రమంలో బాజపా గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు,గొల్లపల్లి కృష్ణ,సిరసపల్లి నూకరాజు, గూటూరు శంకరరావు,బియంఎస్ అధ్యక్షులు కొమ్మినేని శ్రీనివాసరావు,కానూరు అప్పలరాజు,పొలిమేర శ్రీనివాసరావు,జగదీష్,కృష్ణారెడ్డి,రామకృష్ణ అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

---

# సమాజ సేవకే వాసవి క్లబ్

## క్లబ్బుల సభ్యుల సంఖ్య పెంచండి

## అంతర్జాతీయ అధ్యక్షులు సిద్ధ

**అనకాపల్లి జూలై 5 జయ జయహే**




సమాజ సేవకే వాసవి క్లబ్బు అంతర్జాతీయ స్థాయిలో 36 దేశాల్లో నిస్వార్ధ సేవలు అందిస్తుందని ఆ క్లబ్బు అంతర్జాతీయ అధ్యక్షులు సిద్దార్ధ సూర్య ప్రకాశరావు చెప్పారు. ఆదివారం జిల్లా పర్యటనకు వచ్చి న ఆయన అనకాపల్లి వైఎంవిఏ హాల్లో జరిగిన జిల్లా సెకండ్ క్యాబినెట్ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై అక్కడ జరిగిన సమావేశంలో మాట్లాడారు. అంతర్జాతీయ స్థాయిలో సభ్యుల సంక్షేమానికి ఎంతో కృషి చేస్తుందని, సంఘం ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతూ.. సభ్యులకు చేదోడు వాదోడుగా ఉంటుందని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరు సంఘ అభివృద్ధికి కృషిచేసి సభ్యుల సంఖ్యను పెంచేందుకు కృషి చేయాలని కోరుతూ క్లబ్బు నిర్వహిస్తున్న వివిధ సేవా సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. త్వరలో క్లబ్బులకు ఉచిత నోట్ పుస్తకాలు అందిస్తామని, ఇప్పటికే విద్యార్థులకు కోసం సరస్వతి పథకం ద్వారా చెక్కులు అందజేశామని, ప్రపంచ వ్యాప్తంగా 10 సేవా కార్యక్రమం నిర్వహించమని చెబుతూ సంస్థకు స్థానిక క్లబ్లె పట్టు కొమ్మలని చెప్పారు. క్లబ్బులు ఏం కోరిన అందిస్తామని, అయితే క్యాలెండర్ కార్యక్రమాలు విధిగా అమలు చేస్తూ డిసెంబర్లో జరగనున్న ఐకాన్ కు పెద్ద ఎత్తున సభ్యులు ఒంగోలు తరలి రావాలని 10000 మందికి ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా పలువురుని సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమానికి జిల్లా గవర్నర్ పి వి రమణమూర్తి అధ్యక్షత వహించగా వాసవి క్లబ్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు, సి యస్ కుమార్ , ఇంటర్నేషనల్ అడ్మినిస్ట్రేటివ్ వైస్ ప్రెసిడెంట్, ఎస్ శ్రీను , ఇంటర్నేషనల్ అడ్మినిస్ట్రేటివ్ వైస్ ప్రెసిడెంట్ (మల్టిపుల్)వుడా త్రినాథ్ రావు , ఇంటర్నేషనల్ కార్పొరేట్ అడ్మినిస్ట్రేటివ్ వైస్ ప్రెసిడెంట్ ఎలమర్తి నర్సింగ్ రావు , ఇంటర్నేషనల్ డైరెక్టర్ కొల్లూరు పార్వతి (పూర్ణిమ), తో పాటు క్యాబినెట్ సభ్యులైన యలమర్తి పరమేశ్వరరావు , క్యాబినెట్ సెక్రెటరీ – సర్వీసెస్, యస్ శ్రీనివాస్ రావు , క్యాబినెట్ ట్రెజరర్, కడ్మిశెట్టి పి వి స్వామి, వైస్ గవర్నర్ రమేష్ కంచర్ల, ఐపీసీలు, డిస్టిక్ ఇన్చార్జిలు ఆర్సీలు, జోన్ చైర్మన్లు జిల్లాలో ఉన్న వివిద క్లబ్బులు అధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారులు పాల్గొన్నారు.

---



### సర్ ప్రక్రియ సమర్థవంతంగా

# పని చేస్తుంది

## శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు

**టెక్కలి జూలై 5 జయ జయహే**

రాష్ట్రంలో సర్ ప్రక్రియ సమర్థవంతంగా పని చేస్తుందని ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం సజావుగా నడుస్తుందని శ్రీకాకుళం జిల్లా పార్లమెంట్ సభ్యులు కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలి నియోజకవర్గశీ ఆయన స్వగ్రామమైన నిమ్మాడ లో సర్ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. బూత్ లెవెల్ అధికారి నుండి ఏ న్యూమరేషన్ పత్రాలను పరిశీలించి అవసరమైన వ్యక్తిగత వివరాలను పొందుపరిచి సంతకం చేసి బి ఎల్ ఓ కు అందజేశారు. ఓటర్ల జాబితాలో పరిపూర్ణత్వం కోసం సర్ ప్రక్రియ సమర్థవంతంగా పనిచేస్తుందని భావిస్తున్నానన్నారు, గ్రామస్థాయిలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, ప్రజలు అందరూ ఈ కార్యక్రమానికి తోడ్పాటు అందించాలని ఎంపీ రామ్మోహన్ నాయుడు తెలిపారు.



### సిక్కోలు పంటలకు

# వంశధార నీళ్లు విడుదల

## ఖరీఫ్ సీజన్ వ్యవసాయ రైతులకు శుభవార్త

**టెక్కలి జూలై 5 జయ జయహే**

శ్రీకాకుళం జిల్లా రైతులకు ఖరీఫ్ సీజన్ వ్యవసాయ పంటలకు వంశధార కాలువ జలాలు విడుదల చేసినట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చం నాయుడు ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. జిల్లాలోని అన్ని మారుమూల ప్రాంతాల పంట భూములకు ఖరీఫ్ సీజన్ వ్యవసాయాలు సమగ్రంగా చేసుకునేందుకు రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తమ పంటలకు వంశధార నీళ్లు విడుదల అవుతున్నాయని మంత్రి స్పష్టం చేశారు, సోమవారం నుంచి నీటి విడుదల చేసేలా జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వంశధార ప్రాజెక్టు చైర్మన్ అరవల రవీంద్ర , వంశధార అధికారులతో ఫోన్లో ఆదేశాలు అందజేసి నట్లు మంత్రి కింజరాపు అచ్చం నాయుడు తెలిపారు.



# ఆధునిక వైద్య సేవలకు చిరునామాగా జీవీఎస్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్

**రాజమహేంద్రవరం, జయజయహే ప్రతినిధి:**

ప్రముఖ వైద్యుడు డాక్టర్ కోట్ల సురేంద్ర కుమారుడు డాక్టర్ శ్రీ రామ్ గోపాల్ తేజ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జీవీఎస్ మల్టీ స్పెషాలిటీ, గ్యాస్ట్రో, న్యూరో ఎమర్జెన్సీ ట్రామా కేర్ హాస్పిటల్ నూతన భవనం ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. దానవాయిపేటలో ధన్వంతరి బ్లడ్ బ్యాంక్ పక్కన ఏర్పాటు చేసిన ఆధునిక సౌకర్యాలతో కూడిన ఆసుపత్రి భవనాన్ని పలువురు ప్రముఖులు ప్రారంభించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమానికి ముమ్మిడివరం శాసనసభ్యుడు దాట్ల బుచ్చి రాజు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, సీసీసీ ఛానల్ ఎండీ పంతం కొండలరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన అత్యాధునిక వైద్య పరికరాలు, అత్యవసర చికిత్స విభాగం, గ్యాస్ట్రో, న్యూరో సేవలను పరిశీలించి అభినందించారు.ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ఆధునిక సదుపాయాలతో ఆసుపత్రిని ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో వేగవంతమైన వైద్య సేవలు అందించే విధంగా ట్రామా కేర్ విభాగాన్ని ఏర్పాటు చేయడం ఈ ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. వైద్య రంగంలో నూతన సాంకేతికతను వినియోగిస్తూ రోగులకు మెరుగైన చికిత్స అందించాలని ఆకాంక్షించారు.డాక్టర్ శ్రీ రామ్ గోపాల్ తేజ మాట్లాడుతూ, ప్రతి రోగికి అందుబాటు ధరల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. అనుభవజ్ఞులైన వైద్య బృందంతో పాటు అత్యాధునిక పరికరాల ద్వారా గ్యాస్ట్రో, న్యూరో, మల్టీ స్పెషాలిటీ సేవలను ఒకేచోట అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు.ఈ కార్యక్రమంలో వైద్యులు, ప్రజాప్రతినిధులు, వివిధ రంగాల ప్రముఖులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు, నగర ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని డాక్టర్ శ్రీ రామ్ గోపాల్ తేజకు శుభాకాంక్షలు తెలిపారు.

# జీవితాన్ని మలుపు తిప్పే దశలో అప్రమత్తత అవసరం





### ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

### మీ భద్రత -- మా బాధ్యత' అవగాహన సదస్సులో విద్యార్థులకు దిశానిర్దేశం

**రాజమహేంద్రవరం :జయ జయహే**

విద్యార్థి దశ మీ భవిష్యత్తుకు పునాది. తల్లిదండ్రులు చెప్పుకోలేని ఏ పనిని కూడా మీరు చేయవద్దు. చట్టాన్ని గౌరవిస్తూ, క్రమశిక్షణతో లక్ష్యసాధన దిశగా అడుగులు వేయండి" అని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) పిలుపునిచ్చారు. స్థానిక మేఘా జూనియర్ కళాశాలలో నిర్వహించిన "మీ భద్రత -- మా బాధ్యత" అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, విద్యార్థులకు కీలక సూచనలు చేశారు. "ఇంటర్మీడియట్ పరీక్షల్లో మార్కులు తగ్గితే బెటర్‌మెంట్ రాసుకునే అవకాశం ఉంటుంది. కానీ, చట్టవ్యతిరేక పనుల వల్ల జీవితంలో జరిగే ఒక్క తప్పు మీ భవిష్యత్తును శాశ్వతంగా దెబ్బతీస్తుంది. ఒక చిన్న కేసు నమోదైనా ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగ అవకాశాలపై అది తీవ్ర ప్రభావం చూపుతుంది. ఆ ప్రభావం మీ కుటుంబంపై పడి, వారికి అవమానం కలిగేలా చేస్తుంది" అని హెచ్చరించారు. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్య, ఉపాధి రంగాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ఆయన తెలిపారు. "రాష్ట్రంలో భారీ పరిశ్రమలు, డేటా సెంటర్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటం వ్యాలీ వంటి ప్రాజెక్టుల ద్వారా యువతకు సొంత రాష్ట్రంలోనే మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఒక్క డిఎస్సీ కూడా నిర్వహించలేదు, కానీ ఇప్పుడు 18 వేల మంది ఉపాధ్యాయుల నియామకం ద్వారా విద్యారంగానికి పెద్దపీట వేస్తున్నాం" అని పేర్కొన్నారు. మహిళల భద్రత విషయంలో ప్రభుత్వం రాజీ పడదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. "జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో 'మహిళా రక్షక్' వ్యవస్థను పటిష్టం చేశాం. సివిల్ డ్రస్‌లో ఉండే ప్రత్యేక బృందాలు నిరంతరం నిఘా ఉంచుతున్నాయి. వేధింపులకు పాల్పడే వారిపై కౌన్సెలింగ్ నుంచి కేసుల నమోదు వరకు చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం. నేరస్తులపై అవసరమైతే పీడీ యాక్ట్, రౌడీషీట్లు నమోదు చేస్తాం. సామాన్య ప్రజలు భయం లేకుండా జీవించడమే మా లక్ష్యం" అని వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, జిల్లా పోలీసు అధికారులు మరియు భారీ సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.



## త్వరలోనే శ్రీ చరణ్‌ను అరెస్టు చేస్తాం..!

### రాధా గాయంత్రి పేరెంట్స్‌కు ముస్సోరీ డీఎస్పీ పంత్ హామీ

**డెహ్రాడూన్ జూలై 5, జయ జయహే :**

ముస్సోరిలో హత్యకు గురైన రాధా గాయత్రి తల్లిదండ్రులు పి. సుధాకర్ పి. సత్యవతి శనివారం డెహ్రాడూన్‌లోని ఎస్ ఎస్ పి కార్యాలయంలో డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ జె. సి. పంత్‌ని కలుసుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్ బృందం తల్లిదండ్రుల ఇద్దరి వాంగ్మూలాన్ని నమోదు చేశారు. వారి కుమార్తె వివాహానంతరం జరిగిన పరిణామాలకు సంబంధించిన అన్ని ఆధారాలు మరియు పత్రాలను సేకరించే ప్రక్రియను పోలీసులు ప్రారంభించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ ఇప్పటికే ఒక పోలీస్ బృందాన్ని శ్రీచరణ్ నివాసమైన ఢిల్లీకి పంపించామని చెప్పారు. ఈ కేసు విషయమై శ్రీచరణ్‌ను వీలైనంత త్వరగా అరెస్ట్ చేస్తామని హామీ ఇచ్చారు. అయితే, ప్రస్తుతం అతను పరారీలో ఉండి తరచుగా తన మొబైల్ ఫోన్‌ను స్విచ్ ఆఫ్ చేస్తుండటం వల్ల అతన్ని అదుపులోకి తీసుకోవడంలో కాస్త ఆలస్యం జరుగుతోందని వెల్లడించినట్టు తెలిపారు. అయితే ఈ కేసుకు సంబంధించి మీరు కొద్ది రోజులు డెహ్రాడూన్‌లోనే ఉండాలని డీఎస్పీ కోరారని, త్వరలోనే అరెస్ట్ జరుగుతుందని హామీ ఇచ్చారని సుధాకర్ తెలిపారు. అలాగే, జరుగుతున్న దర్యాప్తుపై విశ్వాసం ఉంచాలని సూచిస్తూ, డెహ్రాడూన్ పోలీసుల నుండి పూర్తి సహకారం అందుతుందని భరోసా ఇచ్చారని వివరించారు.



## జనసేన సంస్థాగత నిర్మాణానికి ధరఖాస్తు

### కొణతాలకు అందించిన గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ వన్నెంరెడ్డి సతీష్ కుమార్

**విశాఖపట్నం, జూలై 5, జయ జయహే :**

జనసేన పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ వన్నెంరెడ్డి సతీష్ కుమార్ దరఖాస్తు అందజేశారు. జనసేన పార్టీ అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలో విశాఖపట్నం పార్లమెంటరీ నియోజవర్గ పరిధిలో జనసేన నిర్మాణ సారదుల సమాచార సేకరణ ప్రక్రియలో భాగంగా సంస్థాగత నిర్మాణంలో భాగమై నాయకత్వ బాధ్యతలు తీసుకునేందుకు పార్టీ శ్రేణులకు సంసిద్ధం కావాలని పిలుపునిచ్చిన సందర్భంగా ఆదివారం విశాఖ పార్లమెంటరీ సమాచార సేకరణ పార్లమెంటరీ పరిశీలకులు అనకాపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు కొణతాల రామకృష్ణను కలిశారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ వన్నెంరెడ్డి సతీష్ కుమార్ స్వయంగా దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ రాజకీయ పార్టీ చేయని విధంగా గ్రౌండ్ లెవెల్ లో పార్టీకి అహర్నిశలు కష్టపడిన వీర మహిళలు జనసేన సైనికులు నేతలు దరఖాస్తు చేసుకోవాలని పిలుపునిచ్చారని అభినందించారు.



## స్కేటింగ్‌లో డబుల్ విజయం

### రాజమహేంద్రవరం స్కేటర్ల ప్రతిభ

**రాజమహేంద్రవరం, జయజయహే ప్రతినిధి:**

రావులపాలెంలో ఇటీవల నిర్వహించిన సీఐఎస్‌సీఈ జోనల్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్--2026 స్కేటింగ్ పోటీల్లో రాజమహేంద్రవరానికి చెందిన రివర్ రింక్ రోలర్ స్కేటింగ్ అకాడమీ విద్యార్థినులు విశేష ప్రతిభ కనబర్చి ప్రథమ, ద్వితీయ స్థానాలను కైవసం చేసుకుని నగరానికి కీర్తి తెచ్చారు. అండర్-11 గర్ల్స్ రింక్--×× విభాగంలో కొండపల్లి యాన్వి అద్భుత ప్రతిభతో ప్రథమ, ద్వితీయ స్థానాలను సాధించి అందరి ప్రశంసలు అందుకుంది. అలాగే అండర్-14 గర్ల్స్ రింక్--× విభాగంలో లాలం లేహ శ్రీ కూడా ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించి తన ప్రతిభను చాటుకుంది. ఈ విజయాలతో ఇద్దరు విద్యార్థినులు తమ పాఠశాల, తల్లిదండ్రులు, కోచ్‌కు గర్వకారణంగా నిలిచారు. విజేతలకు రాజమహేంద్రవరంలో ఘన సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 43వ వార్డు కార్పొరేటర్ కంటిపూడి శ్రీనివాస్, పద్మ, వార్డు సభ్యులు, రాజమహేంద్రవరం మున్సిపల్ కమిషనర్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థినులను అభినందించారు. చిన్న వయస్సులోనే రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో మరిన్ని విజయాలు సాధించి రాజమహేంద్రవరం పేరును మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. ఈ విజయాల వెనుక రివర్ రింక్ రోలర్ స్కేటింగ్ అకాడమీ కోచ్ కెల్లా లక్ష్మణ్ అందించిన క్రమశిక్షణతో కూడిన శిక్షణ, సాంకేతిక మార్గదర్శకత్వం, అలాగే తల్లిదండ్రుల నిరంతర ప్రోత్సాహం కీలక పాత్ర పోషించాయని అతిథులు కొనియాడారు. కోచ్ కెల్లా లక్ష్మణ్‌ను ప్రత్యేకంగా అభినందిస్తూ, ఆయన శిక్షణలో మరెందరో విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా అకాడమీ ప్రతినిధులు మాట్లాడుతూ, విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు అంతర్జాతీయ ప్రమాణాల శిక్షణ అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు.



## సుగర్ ఫ్యాక్టరీపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోండి: భీశెట్టి బాబ్జి

**విజయనగరం జులై 5:(జయ జయహే)**

భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ గడిచిన ఏడు సంవత్సరాలనుండి మూతపడి ఉండటంతో కార్మికులు, ఉద్యోగులు ఉపాధిలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రాష్ట్ర ప్రభుత్వం త్వరగా సత్వర నిర్ణయం తీసుకోవాలని ఏపీ లోక్ సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ దృష్టి కి తీసుకు వచ్చారు ఆదివారం మంత్రిని క్యాంపు కార్యాలయంలో భీమసింగి కార్మిక నాయకులతో కలిసి ప్రస్తుత పరిస్థితిని వివరించారు కూటమి ప్రభుత్వం వచ్చినవెంటనే సుగర్ ఫ్యాక్టరీ రైతులకు, కార్మికులకు, ఉద్యోగులకు తగిన న్యాయం జరుగుతుందని ఆశించామని నేటికీ కార్మికుల ఉద్యోగుల పిఎఫ్, గ్రాట్యూటీ ప్రభుత్వం చెల్లించకపోవడంతో కార్మికుల, ఉద్యోగుల కుటుంబాలు రోడ్డున పడ్డాయాని, చాలామంది కార్మికులు ఆవేదన తో మరణించారాని రాష్ట్ర ప్రభుత్వం త్వరగా తగిన నిర్ణయం ప్రకటించకపోతే ఇంకా ఇబ్బందులు పడవలసి ఉంటుందని వచ్చే క్యాబినెట్ సమావేశంలో తగిన నిర్ణయం తీసుకోవాలని కార్మికుల, ఉద్యోగుల పిల్లలకు అర్హత ఉన్నవారికి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయంలో గాని కొత్త గా జిల్లాకి వచ్చేనూతన పరిశ్రమల్లో ఉపాధి కల్పించాలని మంత్రిని కోరామని ఇటీవల మంత్రి కొండపల్లి కార్మికులకి రావలసిన బకాయిల్లో ప్రతి ఒక్కరికీ ఏడు వేల రూపాయలు అడ్వాన్స్ ఇప్పించినందుకు కార్మికులు మంత్రికి ధన్యవాదాలు తెలియ చేసారు , ప్రభుత్వం నుండి త్వరలోనే సుగర్ ఫ్యాక్టరీ పై మంచి ప్రకటన వస్తుందని, కార్మికుల ఉద్యోగుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి కొండపల్లి హామీ ఇచ్చారని భీశెట్టి తెలియచేసారు ఈ కార్యక్రమం లో ఉంగరాల శ్రీను, సారిక పకీర్, భీశెట్టి అదిబాబు, వర్రి నారంనాయుడు, జంకల అప్పలనాయుడు, చలుమూరి వెంకటరావు, ఎన్. రాంబాబు, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రశ్నించే గొంతుకలను కాపాడుకుందాం

### వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి

**గుంటూరు (జయ జయహే)**




ప్రశ్న సమాజ పురోగతికి నాంది అని ప్రశ్నించే గొంతుకలను నిర్బంధిస్తే,అణిచి వేస్తే ఫాసిజానికి పునాది అవుతుందని యూట్యూబర్ ప్రశ్న రావణ్ పై గత 5 రోజులుగా 5 పోలీస్ స్టేషన్ల సిబ్బంది అక్రమంగా అదుపులోకి తీసుకోవడం న్యాయస్థానాలు బెయిల్ ఇస్తున్న మరలా వెంటనే మరో పోలీస్ స్టేషన్ సిబ్బంది అదుపులోకి తీసుకోవడం అధికార పార్టీ నేతలు పోలీస్ వ్యవస్థ దుర్వినియోగం చేయడానికి పరాకాష్ట అని జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి గుంటూరులోని మీడియా సమావేశంలో పేర్కొన్నారు. అధికార పార్టీ నేతల కనుసన్నలలో పోలీస్ వ్యవస్థ కొనసాగించడం వలన పోలీస్ వ్యవస్థ పట్ల ప్రజలలో అపనమ్మకం పెరుగుతుందన్నారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ ఘోరంగా విఫలమౌతుందని, సాయి కృష్ణ లాకప్ డెత్, క్రాంతి కుమార్ ఆత్మహత్యలే నిదర్శనం అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పోలీసుల అధికార దుర్వినియోగంపై సిబిఐతో దర్యాప్తు నిర్వహించాలని కోరారు. ప్రశ్న రావణ్ ను వెంటాడడం, వేధించడం మానుకుని జిల్లా స్థాయి ప్రభుత్వ ఆసుపత్రులలో అత్యవసర ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి 7 సంవత్సరాల లోపు శిక్ష పడే కేసులలో స్టేషన్ బెయిల్ ఇవ్వవలసి ఉండగా ప్రశ్న రావణ్ ను గత 5 రోజులుగా పిఠాపురం పోలీసులు హైదరాబాద్ లో మొదటి అరెస్టు చేయగా, 2వ అరెస్టు కాకినాడ పోలీసులు, 3వ అరెస్టు మచిలీపట్నం పోలీసులు, 4వ అరెస్ట్ పాయకరావుపేట పోలీసులు, 5వ అరెస్ట్ ఏలూరు పోలీసులు చేయడం అప్రజాస్వామీకం, రాజ్యాంగ విరుద్ధం. వీటి అన్నింటిలో న్యాయస్థానాలు వం-సగా బెయిల్ మంజూరు చేస్తున్నా ప్రశ్నించే గొంతుకను చంపాలని దుర్మార్గపు ఆలోచనలతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేయడం దారు-ణమన్నారు. గంజాయి, డ్రగ్స్, బెల్ట్ షాపులు, ఘర్షణలపై పోలీస్ వ్యవస్థ దృష్టి పెట్టకుండా ప్రశ్నించే రావణ్ పై అక్రమ కేసులు బనాయించడానికి వందలాది మంది పోలీసులను కేటాయించడం ప్రజాస్వామ్య విరుద్ధం. అధికార పార్టీ నేతలు పచ్చి బూతులతో మాట్లాడుతున్న వారిపై ఒక్క కేసు ఉండకపోగా పలు సామాజిక,ఆర్థిక,రాజకీయ, సాంస్కృతిక సమస్యలపై ప్రశ్నించే గొంతుకలను అణచివేయాలనే భావనకు రాష్ట్ర ప్రభుత్వం స్వస్తి పలకాలని జన చైతన్య వేదిక విజ్ఞప్తి చేస్తుంది. ఇలాంటి చర్యలు కొనసాగుతూ ఉంటే తటస్తులుగా ఉన్న ఓటర్ల నమ్మకాన్ని, విశ్వాసాన్ని కోల్పోతారన్నారు. ఆంధ్రప్రదేశ్ లో ఉన్న మేధావులు మౌనం వీడి ప్రభుత్వ అప్రజాస్వామిక విధానాలపై ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని తెలిపారు.

## బుచ్చినాయుడు కండ్రిగ సీఐగా కె.లక్ష్మీనారాయణ

**శ్రీకాళహస్తి,జయజయహే.**



బుచ్చినాయుడు కండ్రిగ సర్కిల్ , తొట్టంబేడు ఇన్స్పెక్టర్‌గా కే. లక్ష్మీనారాయణ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. క్రైమ్ నియంత్రణలో ప్రత్యేక ముద్ర వేసిన అధికారిగా పేరు తెచ్చుకున్న లక్ష్మీనారాయణ, గతంలో చిత్తూరు క్రైమ్ విభాగంలో ఎనలేని సేవలు అందించారు. నేరస్తుల పట్ల కఠినంగా, సామాన్య ప్రజల పట్ల సౌమ్యంగా వ్యవహరించే వారి పనితీరుకు ప్రజల్లో మంచి ఆదరణ ఉంది. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, సర్కిల్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, మహిళలు, చిన్నారుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తానని, గంజాయి, అక్రమ మద్యం, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతానని తెలిపారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. సమర్థవంతమైన, నిజాయితీ గల అధికారి సీఐగా రావడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆయన నాయకత్వంలో బుచ్చినాయుడు కండ్రిగ సర్కిల్, తొట్టంబేడు మండల పరిధిలో నేర రహిత వాతావరణం నెలకొంటుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# పీడియాట్రిక్ వైద్య రంగంలో అధునాతన వైద్య విజ్ఞానం

## కిమ్స్ కడిల్స్ ఆధ్వర్యంలో "పీడియాట్రిక్ సబ్‌స్పెషాలిటీ అప్‌డేట్ "

**విశాఖపట్నం, జూలై 5, జయ జయహే :**

కిమ్స్ కడిల్స్ మదర్స్ అండ్ ఛైల్డ్ సెంటర్ ఆధ్వర్యంలో "పీడియాట్రిక్ సబ్‌స్పెషాలిటీ అప్‌డేట్ -- అడ్వాన్స్‌డ్ పీడియాట్రిక్ కేర్‌లో మల్టీడిసిప్లినరీ నైపుణ్యం" అనే అంశంపై ఆదివారం నోవోటెల్ హోటల్‌లో కంటిన్యూయింగ్ మెడికల్ ఎడ్యుకేషన్ కార్యక్రమం జరిగింది. ఈ సదస్సుకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి 200 మందికి పైగా చిన్నపిల్లల వైద్యులు, సూపర్ స్పెషాలిటీ నిపుణులు, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు, వైద్య రంగానికి చెందిన నిపుణులు హాజరయ్యారు. చిన్నారుల్లో కనిపించే క్లిష్ట వ్యాధుల నిర్ధారణ, ఆధునిక చికిత్సా విధానాలు, నవజాత శిశు సంరక్షణ, మల్టీ డిసిప్లినరీ వైద్య సేవలు, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణమైన చికిత్సా విధానాలపై ప్రముఖ నిపుణులు సవివరంగా చర్చించారు.ఈ సిఎంఈ కార్యక్రమాన్ని డా. నిఖిల్ టెన్నేటి, డా. సంతోష్ కుమార్ రౌతు మరియు డా. గురు ప్రసాద్ ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించారు. వైద్యులు నిరంతరం వైద్యరంగంలో వస్తున్న నూతన పరిణామాలను తెలుసుకుంటూ తమ నైపుణ్యాలను పెంపొందించుకోవడం ద్వారా చిన్నారులకు మరింత నాణ్యమైన వైద్య సేవలు అందించవచ్చని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి కిమ్స్ ఐకాన్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డా. సతీష్ కుమార్ పేతకంశెట్టి, డా. సాయి బలరామ కృష్ణ, కిమ్స్ హాస్పిటల్ ఆర్‌సీఈఓ డా. నాగేశ్, కిమ్స్ ఐకాన్ హాస్పిటల్ సీఓఓ డా. విశ్వమోహన్, కిమ్స్ కడిల్స్ వైస్ ప్రెసిడెంట్ కె.ఎన్.వి. దిలీప్ కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.




ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఇలాంటి శాస్త్రీయ సదస్సులు వైద్యులకు తాజా వైద్య పరిజ్ఞానాన్ని అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని, చిన్నారులకు అత్యుత్తమ వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో కిమ్స్ కడిల్స్ నిరంతరం విద్యా, పరిశోధన మరియు వైద్య సేవలకు ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన డా. నిఖిల్ టెన్నేటి, డా. సంతోష్ కుమార్ రౌతు, డా. గురు ప్రసాద్ మరియు వారి బృందాన్ని ముఖ్య అతిథులు అభినందించారు. ఈ సదస్సు ద్వారా పీడియాట్రిక్ వైద్య రంగంలో తాజా వైద్య విజ్ఞానాన్ని పంచుకోవడంతో పాటు, చిన్నారులకు అందించే వైద్య సేవల నాణ్యత మరింత మెరుగుపడుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

# చేతులు తడిపినా...సేవ చేయని వైద్య ఉద్యోగి

**- అడిగినంతా ఇచ్చినా పూర్తి పెన్షన్ ఇవ్వని దౌర్భాగ్యం**

**- న్యాయం చేయాలని రెండేళ్లుగా తిరిగినా పట్టని అధికారగణం**

**- ఆందోళనలో ఆరోగ్య కేంద్రం ఉద్యోగులు**

**సబ్బవరం, జూలై 5, జయ జయహే :**

అనకాపల్లి జిల్లా సబ్బవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రేడియోగ్రాఫర్‌గా సుమారు 30 సంవత్సరాలు ప్రభుత్వ సేవలందించిన పల్లికొండ జైపాల్ 2024 జూన్ నెలాఖరున పదవీ విరమణ చేశారు. అప్పటి నుంచీ ఆయన తన పెన్షన్ కోసం పోరాటం చేస్తూనే ఉన్నారు. అడిగినంతా వైద్య ఉద్యోగులకు అందించినా ఫలితం లేకపోయే సరికి ఆఖరి మజిలీ గడిపేందుకు నానా పాట్లు పడుతున్నారు. బాధితుని వివరాల మేరకు పెన్షన్ ప్రతిపాదనలు అకౌంటెంట్ జనరల్ కార్యాలయానికి పంపే సమయంలో 18 సంవత్సరాల స్పెషల్ గ్రేడ్ ఇంక్రిమెంట్, 24 సంవత్సరాల స్పెషల్ గ్రేడ్ ఇంక్రిమెంట్‌లను పరిగణనలోకి తీసుకోకుండా, పదవీ విరమణ నాటి ప్రాథమిక వేతనం ఆధారంగా మాత్రమే పెన్షన్ కేసు పంపించడంతో తనకు అరకొర పెన్షన్ మాత్రమే వస్తుందని ఆరోపించారు. తనకు న్యాయబద్ధంగా రివైజ్డ్ పెన్షన్, రివైజ్డ్ గ్రాట్యుటీ, రివైజ్డ్ కమ్యూటేషన్, 300 రోజుల లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ తదితర ప్రయోజనాలతో కలిపి సుమారు రూ. 15 లక్షలకు పైగా నష్టం జరిగినట్లు ఆయన ఆవేదన చెందుతున్నారు. ఈ తప్పిదాన్ని సరిదిద్దాలని పలుమార్లు కోరినా సంబంధిత సీనియర్ అసిస్టెంట్ స్పందించడం లేదని, గతంలో పెన్షన్ ఫైల్‌కు సంబంధించి ఆమె అడిగినంతా అందించానని చెబుతున్నారు. తనకు న్యాయం చేయాలని కోరితే తనపై బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆయన వాపోతున్నారు. గతంలో కూడా పెన్షన్ వ్యవహారాల్లో నిర్లక్ష్యం కారణంగా సంబంధిత సీనియర్ అసిస్టెంట్ పై శాఖాపరమైన చర్యలు తీసుకున్నప్పటికీ, పరిస్థితిలో మార్పు కనిపించడం లేదని ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.




ఫిబ్రవరి 2027లో సబ్బవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మరికొందరు ఉద్యోగులు పదవీ విరమణ పొందనున్న నేపథ్యంలో, వారి పెన్షన్ వ్యవహారాలపైనా ఉద్యోగుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు ఈ వ్యవహారంపై వెంటనే విచారణ చేపట్టి, బాధ్యులపై తగిన చర్యలు చేపట్లాలని కోరుతున్నారు. బాదితుడు పల్లికొండ జైపాల్‌కి రావలసిన అన్ని పెన్షన్ ప్రయోజనాలు త్వరితగతిన మంజూరు చేయాలని బాధిత ఉద్యోగితో పాటు తోటి ఉద్యోగులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# మత్స్యకారుల గల్లంతుపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆందోళన





**- ప్రమాదం జరిగి 24గంటలు గడిచిన ప్రభుత్వ తీరు దారుణం**

**- మత్స్యకారుల కష్టసుఖాలన్నీ సముద్రంతో ముడిపడి ఉంటాయి**

**- బాధిత కుటుంబాలకు వైసీపీ అండగా ఉంటాది**

**- వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా పార్టీ అధ్యక్షులు కేకే రాజు**

**విశాఖపట్నం, జూలై 5, జయ జయహే :**

విశాఖ ఫిషింగ్ హార్బర్ నుంచి చేపలవేటకు వెళ్లిన జాలర్లు సముద్రంలో గల్లంతైన మత్స్యకారుల కుటుంబ సభ్యులను విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్‌కి వెళ్లి వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, సమన్వయకర్తలు తిప్పల శ్రీనివాస్ దేవన్ రెడ్డి , మొల్లి అప్పారావు, వాసుపల్లి గణేష్ కుమార్ తదితర ముఖ్య నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా కేకే రాజు మాట్లాడుతూ..ప్రమాదవశాత్తు బోటు మునిగిపోవడంతో ఆరుగురు మత్స్యకారులు గల్లంతవడం అత్యంత దురదృష్టకరమన్నారు. అదృష్టవశాత్తూ కర్రి చిన్నా మాత్రమే మృత్యుంజయుడిగా తిరిగి వచ్చారన్నారు. శనివారం మధ్యాహ్నం మూడు గంటల సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకున్నప్పటికీ, ఇప్పటి వరకు ప్రభుత్వం తగిన చొరవ చూపకపోవడం విచారకరమన్నారు. గత మూడు రోజులుగా బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేవని తెలిసినా, వెంటనే ప్రత్యేక రక్షణ చర్యలు చేపట్టివుంటే గల్లంతైన మత్స్యకారులను గుర్తించే అవకాశాలు మరింత మెరుగ్గా ఉండేవన్నారు. గల్లంతైన మత్స్యకారులందరూ విజయనగరం జిల్లా ముక్కాం గ్రామానికి చెందిన ఒకే కుటుంబ సభ్యులు కావడం మరింత బాధాకరం. రాష్ట్ర మంత్రి, స్థానిక ఎమ్మెల్యేలు గ్రామానికి వచ్చినప్పటికీ బాధిత కుటుంబాలను ప్రత్యక్షంగా పరామర్శించకుండా అధికారులతో సమావేశాలు నిర్వహించి వెళ్లిపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. మా నాయకుడు వై.యస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తోంది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తిస్థాయిలో వినియోగించి గల్లంతైన ఆరుగురు మత్స్యకారులను గుర్తించే వరకు ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు కొనసాగించాలని మేము డిమాండ్ చేస్తున్నాం. అలాగే, సముద్రంలో ప్రాణాలకు తెగించి వేటాడే మత్స్యకారులకు సరైన భద్రతా చర్యలు, బీమా సదుపాయాలు, సబ్సిడీలు మరియు ప్రభుత్వ భరోసా అందడం లేదు. బోట్లకు, మత్స్యకారులకు బీమా ప్రీమియం చెల్లించే స్థోమత లేకపోవడంతో ప్రభుత్వం ప్రత్యేక పథకాలు అమలు చేయాల్సిన అవసరం ఉంది. వేట సమయంలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, వాతావరణ హెచ్చరికలు, భద్రతా మార్గదర్శకాలు వంటి అంశాలపై మత్స్యకారులకు సమగ్ర అవగాహన కల్పించాలి. ఈ కార్యక్రమం పార్టీ ముఖ్య నాయకులు కట్టుమూరి సతీష్ , పేడాడ రమణి కుమారి , కొండ రాజీవ్ గాంధీ, మంచం నాగమల్లేశ్వరి, పేర్ల విజయ చంద్ర , చెన్న జానకిరాము, జీలకర్ర నాగేంద్ర, ఎం సునీల్ , శ్రీదేవి వర్మ, బోని శివ రామకృష్ణ, దేవరకొండ మార్కండేయులు, సనపల రవీంద్ర భరత్, ఉమ్మడి కళ్యాణ, బొట్టేటి కిరణ్ గొందేసి శ్రీనివాస్ రెడ్డి, సతీష్, పార్వతి, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.




# మత్స్యకారుల కోసం నిరంతరంగా రెస్క్యూ ఆపరేషన్

## జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్

**విశాఖపట్నం, జులై 5, జయ జయహే**

సముద్రంలో గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ కోసం నేవీ, కోస్ట్ గార్డ్, మెరైన్ పోలీస్ సంయుక్తంగా యుద్ధప్రాతిపదికన సెర్చ్ అండ్ రెస్క్యూ ఆపరేషన్ కొనసాగిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ పేర్కొన్నారు. ఆదివారం ఉదయం విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో గల్లంతైన మత్స్యకారుల కుటుంబ సభ్యులను కలెక్టర్ పరామర్శించి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, గల్లంతైన వారిని గుర్తించే వరకు గాలింపు చర్యలు నిరంతరంగా కొనసాగుతాయని భరోసా ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడిన కలెక్టర్, సమాచారం అందిన వెంటనే జిల్లా యంత్రాంగం అప్రమత్తమై కోస్ట్ గార్డ్, నేవీ, మెరైన్ పోలీస్‌లతో కలిసి గాలింపు చర్యలు ప్రారంభించినట్లు గుర్తు చేశారు. జాయింట్ ఆపరేషన్స్ సెంటర్ సమన్వయంతో హెలికాప్టర్లు, నౌకలు, కోస్ట్ గార్డ్ షిప్‌లను వినియోగిస్తూ చివరిసారిగా అందిన సిగ్నల్స్, బోటు ప్రయాణించిన దిశ ఆధారంగా నడి సముద్రంలో ముమ్మర గాలింపు కొనసాగుతోందన్నారు. బోటులోని ఏడుగురిలో బోటు యజమాని కారి చిన్నను ఒక వాణిజ్య నౌక సురక్షితంగా రక్షించిందని, మిగిలిన వారి ఆచూకీ కోసం అన్ని ప్రభుత్వ యంత్రాంగాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు. గల్లంతైన మత్స్యకారులను సురక్షితంగా గుర్తించే వరకు అందుబాటులో ఉన్న అన్ని వనరులతో రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతుందని, బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని జిల్లా కలెక్టర్ పునరుద్ఘాటించారు. బాధిత కుటుంబాల సభ్యులను నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం మాధవి పరామర్శించి ధైర్యం చెప్పారు.



# ఘనంగా అపరంజి 75వ అమృత మహోత్సవం

**అగనంపూడి, జూలై 5, జయ జయహే**

బీకే అపరంజి 75 వ అమృత మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. అగనంపూడి బీసీ కాలనీ ఓం శాంతి ధ్యాన మందిరములో ఆదివారం రాజయోగి బీకే అపరంజి 75వ జన్మదిన సందర్భంగా అగనంపూడి సెంటర్ నుండి దివ్య మందిరం వరకు మేళ తాళాలతో ఆమెని ఊరేగించారు. ఓం శాంతి జ్ఞాన మందిరంలోకి తీసుకుని వచ్చి 75 రకాల స్వీట్స్‌తో సన్మానించారు. ఆమెతో పాటు మౌంట్ అబూ నుండి వచ్చిన రాజయోగి బీకే కొండలరావు బైజీ మాట్లాడుతూ సుమారు నాలుగు దశాబ్దాలు నుండి బి కే అపరంజ ఈశ్వరయ్య ఆశీస్సులతో బట్టీలు యోగా కార్యక్రమాలు మెడిటేషన్ మరియు సామాజిక సేవలు విస్తృతంగా చేశారని ఎంతో మందిని అక్కల్ని, అన్నయ్యలను ఓం శాంతి సేవకు పరిమితం చేశారని అటువంటి ఆమెకు అగనంపూడి ఓం శాంతి ఆధ్వర్యంలో ఇంత ఘనంగా సన్మానించడం అభినందినీయమన్నారు. విశాఖ ఉమ్మడి జిల్లా బ్రహ్మకుమారిస్ కోఆర్డినేటర్ రాజయోగి బికే సోమేశ్వరి సభ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బ్రహ్మకుమారిస్ విశాఖ జిల్లా ఇన్చార్జ్ బి కే వేణి ఏ డి సి చైర్మన్ బాలిరెడ్డి సత్యనారాయణ అగనంపూడి ధ్యాన మందిర్ ఇంచార్జ్ రామకోటి మరియు సుమారు వెయ్యి మంది ఓం శాంతి ప్రతినిధులు పాల్గొన్నారు,

# విశాఖ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతీయొద్దు

## బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ జిల్లా కలెక్టర్ కు గంటా లేఖ

**విశాఖపట్నం, జులై 6: (జయ జయహే)**



విశాఖ బ్రాండ్ ను దెబ్బ తీసేలా ప్రభుత్వ భూముల గురించి ఇటీవల పత్రికల్లో పతాక శీర్షికల్లో వస్తున్న కథనాలపై సమగ్ర విచారణ జరపాలని జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ ను భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కోరారు. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్ లు గూగుల్ డేటా సెంటర్, ప్రపంచ ప్రఖ్యాతి చెందిన ఐటీ సంస్థలను తెచ్చి విశాఖకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకువచ్చారని తెలిపారు. ఎండాడలో 30 ఎకరాల్లో రూ. 600 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కాజేసే కుట్ర జరిగిందన్న వార్తలు దినపత్రికల్లో ప్రచురించిన విషయాన్ని ప్రస్తావిస్తూ నిజానిజాల నిగ్గు తేల్చాలని కలెక్టర్ కు రాసిన లేఖలో పేర్కొన్నారు. రెవిన్యూ యంత్రాంగంపైనా.. భూ రికార్డుల గురించి చేసిన తీవ్రమైన ఆరోపణలపై ప్రజల్లో చర్చ నడుస్తోందన్నారు. పత్రిక కథనంలో ఆరోపించిన విధంగా అవకతవకలు జరిగినట్టు తేలితే ప్రజాప్రతినిధులు, అధికారులు ఏ స్థాయి వ్యక్తులైనా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న భీమిలి నియోజకవర్గంలో గజం ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కావడానికి వీల్లేదన్నారు. విలువైన భూముల దోపిడీ ఆరోపణల్లో నిజానిజాలను తెలుసుకునే హక్కు భీమిలి ప్రజలకు ఉందని పేర్కొన్నారు. విశాఖను పెట్టుబడుల స్వర్గ ధామంగా మార్చడంతో భీమిలి, ఆనందపురం, మధురవాడ తదితర ప్రాంతాల్లో భూముల ధరలు పెరిగాయన్నారు. ప్రభుత్వ భూముల అన్యాక్రాంతం చేసే వారి విషయంలో తీవ్రంగా వ్యవహరించాలని ఆదివారం కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ కు చెప్పారు. లేఖపై సమగ్ర విచారణకు జేసీ విద్యాధరికి కలెక్టర్ ఆదేశించారని గంటా తెలియజేశారు. ప్రభుత్వ భూములు కాజేసేందుకు ప్రయత్నించే వారిపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని హెచ్చరించారు.

# బొమ్మూరు పంచాయతీ అవినీతిపై రాజకీయ అండ?

## అవినీతి ఆరోపణలపై ఎమ్మెల్యే స్పందిస్తారా?

**రాజమహేంద్రవరం, జయజయహే బ్యూరో:**




తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ మండలంలోని బొమ్మూరు గ్రామ పంచాయతీ మరోసారి తీవ్ర వివాదాల్లో చిక్కుకుంది. గ్రామ పంచాయతీ సెక్రటరీ పనితీరు, అక్రమ లేఔట్లు, అనుమతులు లేని నిర్మాణాలు, పరిపాలనా వైఫల్యాలపై వరుసగా వెలువడుతున్న కథనాల నేపథ్యంలో రాజకీయ జోక్యం చోటుచేసుకుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

స్థానికంగా ఓ దినపత్రిక లో వార్త ప్రచురితమైన అనంతరం తెలుగుదేశం పార్టీ నాయకుడు మచ్చేటి ప్రసాద్ స్వయంగా విలేకరికి ఫోన్ చేసి, "లేఔట్లకు పంచాయతీ సెక్రటరీకి సంబంధమే లేదు. అలా రాయడం సరికాదు" అంటూ అభ్యంతరం వ్యక్తం చేసినట్లు సమాచారం. అంతేకాదు, "అనుమతులు లేని భవనాలు మా హయంలో నిర్మించినవి కావు" అంటూ సెక్రటరీని సమర్థించే వ్యాఖ్యలు చేసినట్లు ఫోన్ సంభాషణలో నమోదైన ఆడియో ఉన్నట్లు తెలుస్తోంది.

అయితే పంచాయతీ వ్యవస్థపై అవగాహన ఉన్న అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు మాత్రం దీనిని పూర్తిగా ఖండిస్తున్నారు. గ్రామ పంచాయతీ పరిధిలో ప్రతిపాదిత లేఔట్‌కు సంబంధించి ఆ భూమి ఏ జోన్‌లో ఉంది, రహదారి సదుపాయం ఉందా లేదా, పంచాయతీ నిబంధనలు అమలులో ఉన్నాయా అనే అంశాలపై ప్రాథమిక పరిశీలన చేసి సంబంధిత అధికారులకు నివేదిక పంపే బాధ్యత పంచాయతీ కార్యదర్శిదేనని స్పష్టం చేస్తున్నారు. అలాంటి కీలక బాధ్యత ఉన్న అధికారికి సంబంధమే లేదని చెప్పడం వాస్తవాలను వక్రీకరించే ప్రయత్నమేనని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

గత రెండేళ్లుగా బొమ్మూరు పంచాయతీ పేరు తరచూ వివాదాల్లోనే వినిపిస్తోంది. అక్రమ కొండల తవ్వకాలు, అనుమతులు లేని లేఔట్లు, అక్రమ భవన నిర్మాణాలు, పంచాయతీలో సిబ్బంది కొరత, కార్యాలయంలో సేవలు సరిగా అందకపోవడం వంటి అంశాలపై అనేకసార్లు ప్రజలు ఫిర్యాదులు చేసినా, సమగ్ర విచారణ మాత్రం జరగలేదనే విమర్శలు ఉన్నాయి.

ఈ నేపథ్యంలో అవినీతి ఆరోపణలపై సమాధానం చెప్పాల్సిన వారిని ప్రశ్నించే బదులు, వార్త రాసిన విలేకరినే తప్పుదోవ పట్టించే ప్రయత్నం జరగడం పలు అనుమానాలకు తావిస్తోంది. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొస్తున్న మీడియాపై ఒత్తిడి తీసుకురావడం వెనుక అసలు ఉద్దేశం ఏమిటన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు బొమ్మూరు పంచాయతీలో జరిగిన అక్రమాలపై పూర్తి స్థాయి విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఈ ఆరోపణలపై స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకుంటారా? లేక వివాదం మరోసారి ఫైళ్లకే పరిమితమవుతుందా? అన్నది ఇప్పుడు స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.



# ఘనంగా వాగ్దేవి పూజ

## హాజరైన ఇంటర్నేషనల్ అధ్యక్షులు

**చోడవరం జులై 5 జయ జయహే**

చోడవరం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో వాసవి యూత్ క్లబ్ ప్రతిష్టాత్మకమైన వాగ్దేవి పూజా కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వాసవి క్లబ్ అంతర్జాతీయ అధ్యక్షులు సిద్ధ సూర్యప్రకాష్ రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో భాగంగా 2000 మంది విద్యార్థులకు ప్లాంకులు, పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్ కిట్స్ చాక్లెట్స్, బిస్కెట్లు, పానీయాలు పంపిణీ చేశారు. అలాగే జిల్లా గవర్నర్ పూసర్ల వెంకట రమణ మూర్తి, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం చైర్మన్ కలగర్ల శేషగిరిరావు , క్యాబినెట్ ట్రెజరర్ సత్యవరపు శ్రీనివాసరావు, రీజనల్ చైర్మన్ పెన్నం రాజా, జోన్ చైర్మన్ ఉప్పల చిన్న రాజలింగం గుప్తా , రీజనల్ సెక్రెటరీ నాలం మూర్తి,డిస్ట్రిక్ట్ అధికారులు, ప్రాజెక్ట్ చైర్మన్ ఉప్పల కృష్ణాజి కొల్లూరు వెంకట నాగ సత్య కుమార్, వాసవి యూత్ క్లబ్ ప్రెసిడెంట్ : కేతవరపు రామకృష్ణ,సెక్రటరీ: పచ్చి కోళ్ల నాగేశ్వరరావు , ట్రెజరర్ : ఎం హరికుమార్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



# ఎస్ఐఆర్‌పై ప్రత్యేక సమావేశం

## సకాలంలో లక్ష్యాలు పూర్తి చేయండి

## స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనిత

**మాడుగుల జూలై 5 జయ జయహే**

జాతీయ ఓటర్ నమోదు కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్స్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై మాడుగుల మండల పరిషత్ కార్యాలయంలో అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనిత ఈ కార్యక్రమంలో పాల్గొని బిఎల్వోలు అందరికీ ఎస్ఐఆర్ పై దిశ నిర్దేశం చేశారు. సకాలంలో అనుకున్న లక్ష్యాలు పూర్తి చేయాలని సూచించారు. మాడుగుల మండలంలో ఇప్పటివరకు ఎంత శాతం నమోదయింది ఎప్పటిలో పూర్తి చేస్తారు ఎవరెవరు ఎంత శాతం చేశారు వాటిపై ముఖాముఖిగా సమీక్ష నిర్వహించారు. ప్రతి ఒక్కరు ఆదివారంలోగా 50% ఎస్ ఐ ఆర్ పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే తగు చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కే రమాదేవి, ఎండిఓకే అప్పారావు, బిఎల్వోలు పాల్గొన్నారు




# పల్లె పల్లెకు బి ఎస్ పి పార్టీ కార్యక్రమం

**పాడేరు: జయ జయహే.**

పాడేరు నియోజకవర్గం లోని కొయ్యూరు మండలం నడిమి పల్లె గ్రామంలో బహుజన్ సమాజ్ పార్టీ పాడేరు అసెంబ్లీ అధ్యక్షులు సుర్ల పోతురాజు సందర్శించారుపల్లె పల్లెకు బి ఎస్ పి పార్టీకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కొయ్యూరు మండలంలోని నడిమి పల్లెం గ్రామంలో ఈ సమావేశం ఏర్పాటు నిర్వహించడం జరిగిందని. గ్రామంలోని ఉన్న సమస్యలను పోతురాజు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని డ్రైనేజీ కాలువ సమస్య అతి ముఖ్యమైనది గా స్థానిక ప్రజలకు వివరించారు. మురికినీలు నిల్వ ఎక్కడైతే ఉన్నాయో దోమలు ఎక్కువై మనిషియులకు కుట్టినట్లయితే వ్యాధులు మలేరియా గ్యాంగు టైపాడ్ తరస్సు వచ్చేస్తున్నాయన్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని ఆయన తెలిపారు. లేనియెడల నిరసన కార్యక్రమం చేపడుతామని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జి చిన్న బాబు. టి బద్రి. వి సోంబాబు. ఎస్ నూకరాజు. తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శిగా అప్పలరాజు

**నక్కపల్లి (జయ జయహే )**



ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర 23 వ మహాసభలు జూలై 3,4, 5 తేదీలలో ఏలూరులో నిర్వహించారు . ఈ మహాసభలు చివరి రోజు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర నూతన కమిటీని సంఘం ఆల్ ఇండియా ప్రధాన కార్యదర్శి విజుక్రృష్ణన్ సమక్షంలో ఎన్నికోవడం జరిగింది. ఈ సందర్భంగా రైతు సంఘం అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు రాష్ట్ర సహాయ కార్యదర్శి గాను, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు గా ఎన్నిక కావడం జరిగింది. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ అనకాపల్లి జిల్లా లో రైతాంగం సమస్యలు పై ఈ మహాసభలలో చర్చించడం జరిగిందని, రాబోయే కాలంలో అనకాపల్లి జిల్లా లో రైతాంగం ఎదుర్కొంటున్న బలవంతపు భూసేకరణ, నిర్వాసితులు 2013 భు సేకరణ చట్టం ప్రకారం ప్యాకేజీ చెల్లించే విధంగాను,సాగు నీరు ప్రోజెక్టు గురించి, రైతులు పండిస్తున్న పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, మూసి వేసిన నాలుగు షుగర్ ఫ్యాక్టరీలను తెరిపించాలని, ఎరువులు, పురుగు మందులు సమస్యలు పైన, రైతుల రుణాలు మాఫీ, సకాలంలో రైతులకు రుణాలు ఇవ్వాలని రైతాంగాన్ని సమీకరించి పోరాటాలు నిర్వహిస్తామని అప్పలరాజు తెలిపారు



# రౌడీషీటర్లకు ధవళేశ్వరం పోలీసుల కౌన్సెలింగ్

## చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు : సిఐ గణేష్

**రాజమహేంద్రవరం: జయ జయహే : జూలై 5**

పోలీసు సూపరింటెండెంట్ డి. నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు నేర నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ధవళేశ్వరం పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లు, నేరచరిత్ర కలిగిన వ్యక్తులు, క్రైమ్ సస్పెక్ట్‌లకు ప్రత్యేక కౌన్సెలింగ్ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ధవళేశ్వరం సిఐ గణేష్ మాట్లాడుతూ, నేరాలకు పూర్తిగా దూరంగా ఉండి సత్ప్రవర్తనతో జీవించాలని సూచించారు. సమాజంలో గౌరవప్రదమైన జీవితం గడపాలంటే చట్టాన్ని గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలు, గొడవలు, బెదిరింపులు, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామనిహెచ్చరించారు.గంజాయి, మత్తు పదార్థాల వినియోగం, రవాణా, విక్రయాలకు పాల్పడిన వారిపై ఎలాంటి ఉపేక్ష ఉండదని, అలాంటి వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండి మంచి నడవడికను అలవర్చుకోవాలని సూచించారు.రౌడీషీటర్లు, క్రైమ్ సస్పెక్ట్‌ల కదలికలపై పోలీసులు నిరంతరం నిఘా ఉంచుతున్నారని, వారి కార్యకలాపాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా, ప్రజల శాంతి భద్రతలకు భంగం కలిగించినా వెంటనే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కౌన్సెలింగ్ కార్యక్రమంలో ధవళేశ్వరం ఎస్సై హరిబాబు, పోలీసు సిబ్బంది పాల్గొని రౌడీషీటర్లకు చట్టాలపై అవగాహన కల్పించారు. సమాజంలో శాంతి, భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

# సర్ ప్రక్రియకు రాజకీయ పార్టీలే సహకరించాలి!

సర్ ప్రక్రియతో ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ పార్టీలు కంగారు పడుతున్నాయి. ఇబ్బడిముబ్బడిగా ఉన్న మద్దతుదారుల ఓట్లు పోతాయన్న భావనలో ఉన్నారు. ముఖ్యంగా ఆంధ్రావారిలో చాలామందికి తెలంగాణలో ఓటు ఉంది. దీనిపై వారు ఆందోళన చెందుతున్నారు. రెండు ఓట్లు ఉంటే తొలగించడం ఖాయం. అలాగే హైదరాబాద్,విజయవాడ లాంటి తదితర పట్టణాల్లో ఉన్నవారికి కూడా అటు సొంతూళ్లు, ఇక్కడా ఓట్లు ఉన్నాయి. వీటిని తొలగిస్తే ఎలా అన్న ఆందోళనలో ఉన్నారు. అన్నింటికి మించి పాతబస్తీ లోనే ఎక్కువ గందరగోళం కనిపిస్తోంది. ఇక్కడ తిష్టవేసిన రోహింగ్యాలతో పాటు, ఇతర దేశాల వారిని గుర్తించడం కొంచెం కష్టమే. ఇకపోతే అధికారులు రోజువారీ సమీక్ష చేస్తూ సర్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటి వరకు ఎక్కడా ఎలాంటి పొరపాట్లు రాలేదు. నకిలీ ఓట్లను నిరోధించేందుకు పక్కాగా ఓ వ్యవస్థ అంటూ లేదు. ఆధార్, పాన్ కార్డులకు పర్మినెంట్ నంబర్ ఉంటోంది. కానీ ఓటుకు అలాంటిదేమీ లేదు. అలాంటి పక్కా వ్యవస్త ఉంటే తప్ప ఎన్నిసార్లు సర్ ప్రక్రియ చేపట్టినా నకిలీ ఓట్లు తొలగింపు అసాధ్యమే. ఇకపోతే ఇల్లుమారిన లేదా, చనిపోయిన వారి ఓట్లను ఎలా తొలగిస్తారన్నది కూడా ప్రశ్నే. ఇదిలావుంటే అన్ని రాజకీయ పార్టీలు సమావేశాలు పెట్టి తమ కార్యకర్తలను అప్రమత్తం చేస్తున్నాయి. ఓట్లు తొలగిపోకుండా చూడాలని జాగ్రత్తలు చెబుతున్నాయి. అందుకు బూత్‌లెవల్లో శిక్షణ కూడా ఇచ్చారు. ఓ వైపు ఈ ప్రక్రియ కొనసాగుతుండగానే సమావేశాలు కొనసాగుతున్నాయి. దీనిని బట్టి రాజకీయ పార్టీల్లో ఆందోళన స్పష్టంగా కనిపిస్తోంది. నకిలీ ఓట్లను తొలగించే విధానాన్ని కేంద్ర ఎన్నికల సంఘం సర్ ద్వారా గత కొన్నేళ్లుగా సంస్కరిస్తోంది. ఇది కొత్తగా బిజెపి ఏలుబడిలో తీసుకువచ్చిందేమీ కాదు. గతంలో యూపిఎ హయాంలోనూ సర్ ప్రక్రియ సాగింది. అయితే అప్పట్లో తూతమంత్రంగా సాగడంతో ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. 'సర్' పక్రియ చట్టబద్ధమేనని, కానీ వాటి కోసం అవలంబించే పద్ధతుల్లో మార్పులు తెచ్చుకోవాలని ఈ దేశ అత్యున్నత న్యాయస్థానం అన్ని రాజకీయ పార్టీలకు, కేంద్ర ఎన్నికల సంఘానికి హితవు చెప్పింది. ఓటు హక్కు ఒకటే యువత భవిష్యత్‌ను నిర్మించుకునేందుకు ఉన్న ఏకైక ఆయుధమని నమ్ముతుంటాం. ఓటు ఉంటేనే నేతలు ఉంటారు. అధికారం ఉంటుంది. అందుకే ఓట్ల కోసం అభ్యర్థులు, పార్టీలు డబ్బులు విరజిమ్మడం ద్వారా అధికార పీఠం దక్కించుకునేందుకు నానా గడ్డీ కరుస్తుంటారు. ఇప్పుడు సర్ ప్రక్రియ ద్వారా తమవారి ఓట్లు పోకుండా జాగ్రత్త పడడం ఇందులో భాగమే.ప్రజాస్వామ్యంలో ధనస్వామ్యం చొరబడిన తరవాత ప్రజాస్వామ్యం ఇప్పుడు వికటిస్తున్నది. ఈ పరిస్థితుల్లో 'ఓటు' దుర్వినియోగం అవుతోంది. డబ్బులు పెట్టి ఓట్లు కొనసడం అలవాటు చేసుకున్నారు. దొంగ ఓట్లతో జాతర నడిపిస్తున్నారు. స్థానికంగా లేని వారికి ఓటు హక్కు కల్పించడం, ఆ ఓటును ఎవరో వేసేస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో సర్' పేరుతో అసలుసిసలు ఓటర్లను జాబితాలోంచి తీసేస్తున్నారన్న ఆరోపణల మధ్య రాజకీయ పార్టీలు ఓట్లను దక్కించుకునేందుకు జాగ్రత్త పడుతున్నాయి. బీహార్, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి, తదితర రాష్ట్రాలకు సర్ ప్రక్రియ పూర్తయిన తరవాతనే ఎన్నికలు జరిగాయి. కొన్ని చోట్ల ప్రభుత్వాలు మారడంతో ఓట్లను తొలగిస్తున్నారన్న ప్రచారం చేపట్టారు. ఇంత ప్రక్షాళన జరిగినా కొన్ని చోట్ల అక్రమంగా తమ ఓట్లు తొలగించారన్న ఆవేదనలు వినిపిస్తూనే ఉన్నాయి. సాధారణ పౌరులెవరికీ 'సర్' పట్ల ఎలాంటి అసంతృప్తి లేదు. ఈ పక్రియలో ఓటు హక్కు కోల్పోయామని ఆందోళన చెందిన ఓటర్లు కూడా ఇప్పుడు ఒక్కక్కరూ ఆందోళన చెందుతున్నారు. ఏ వ్యవస్థలో అయినా లోపభూయిష్టమైన విధానాలకు చెక్ పెట్టాల్సిందే. ఓటు ఉన్నవారు నిర్భయమంగా ఉండాల్సిందే. ఎలాంటి ఆందోళనలు అవసరం లేదు.

ఎన్నికల సంఘం కూడా అలాంటి వారిని ఎక్కడా తప్పు పట్టడం లేదు. జాబితాలో తొలగించడం లేదు.

అవగాహన లేనివారు మాత్రమే ఆందోళనతో అయోమయంలో పడిపోతున్నారు. ప్రజాస్వామ్యంలో ఓటరు జాబితా ఎంతో విశ్వసనీయత కలిగి ఉండటం అవసరం. రెండు ఓట్లు, ఇక్కడ లేని వారి ఓట్లు, చనిపోయిన వారి ఓట్లు తొలగించేందుకు ఇసికి రాజకీయ పార్టీలు సహకరిస్తే సమస్య సులువుగా పరిష్కారం అవుతుంది. కానీ రాజకీయా పార్టీలు అలా చేయడం లేదు. రాజకీయ పార్టీల చర్యలు ఓటర్లలోనూ గందరగోళంలఅఓ పడేసేలా ఉంటోంది. ఓట్లు పోతాయంటూ చేస్తున్న హెచ్చరికలు భయాందోళనకు గురి చేస్తున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నవారు తమ ఓటు ఎక్కడ పోతుందో అన్న ఆందోళన చెందుతున్నారు. శాశ్వతంగా ఒకే ప్రాంతంలో నివసించే వారిఓట్ల జోలికి ఇసి వెళ్లడం లేదు. కొన్ని చోట్ల తాము వెళ్లినప్పుడు ఓటర్లు అక్కడ లేకపోవడం, తగిన కారణాలు చూపక పోవడంతో తొలగించడం జరుగుతోంది. ఇంటింటికీ వెళ్లి ధృవీకరణద్వారా జాబితాను జల్లెడ పడుతున్నారు. ఒకటి కన్నాఎక్కువ ప్రాంతాల్లో పేర్లు నమోదై, వారు మరో చోట నివసిస్తుంటే వారి ఓటు హక్కు ఆ ప్రాంతానికే మార్చుకోవాలి. ఎక్కడ శాశ్వత నివాసం ఉంటుందో అక్కడే ఓటును పొందాలి. అంతేగానీ పలుచోట్ల ఓటును కలిగి ఉండడం కూడా నేరం. ఇలాంటి విషయాలను రాజకీయా పార్టీలు ప్రచారం చేయడం లేదు. రాజకీయ ఎత్తుగడ కోసం ఓట్లు తొలగిస్తున్నారని దుష్ప్రచారం చేస్తున్నాయి. 'సర్' పూర్తిగా చట్టబద్ధమైన పారదర్శక పక్రియ అనడంలో సందేహమే లేదు. కేంద్ర ఎన్నికల సంఘం తరచు సమీక్షలు చేయడం ద్వారా ఓటర్ల గుర్తింపునకు వెసులు బాటుగా అవగాహన కల్పించడం, వారి ఓటుకు చోటు లభించేటట్లు చేయడం అత్యంతావశ్యకం. అవగాహనలోపం వల్ల అర్హులైన ఓటర్లు కూడా తమ 'ఓటుహక్కును దక్కించుకోవడం కోసం అజాగ్రత్తగా ఉండరాదు. రాజకీయ పార్టీలు గ్రామాల వారీగా జాబితాలు ముందుర వేసుకుంటే ఎవరు స్థానికులో ఎవరు కాదో తెలుస్తుంది. ఎవరు ఓటరో కాదో తెలుస్తుంది. చనిపోయిన వారు ఎవరో కూడా వారికి తెలుసు. ఇలాంటి విషయాల్లో ఆయా పార్టీలు నేరుగా ఎన్నికల సంఘానికి సహకరించి, అనర్హత కలిగిన ఓట్లను తొలగించాలి. అప్పుడే ఓటరు సమగ్ర జాబితా రూపొందగలదు.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1,
BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com